PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 98 | విజయవాడ, ఆదివారం 9 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 9 November 2025 | Rs

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ విజయభేరి

- స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికల్లో

7



టి20 సిరీస్ టీమిండియా కైవసం

- ఆస్ట్రేలియాతో ఐదో మ్యాచ్ వర్షంతో రద్దు
- ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అభిషేక్ శర్మ

8

నిధులు విదల్చని కేంద్రం

ఇవ్వాల్సింది రూ.32,284 కోట్లు.. ఇచ్చింది రూ.4,014 కోట్లే

- కూటమిలో ఉన్నా రాష్ట్రానికి మొండిచేయే
- అర్ధ వార్షిక లెక్కలతో ఆందోళన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్‌డిఎ కూటమిలో భాగంగా ఉన్నప్పటికీ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల చిన్నచూపు చూస్తూనే ఉంది. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఉందని చెబుతున్న మాటలకు ఆచరణకు పొంతన కనపడటం లేదు. కేంద్రం నుండి రాష్ట్రానికి రావాల్సిన గ్రాంట్లలో భారీ ఎత్తున కోత పడటమే దీనికి తాజా నిదర్శనం. ఈ సంవత్సరపు వార్షిక బడ్జెట్ ప్రతిపాదనల్లో 32,284 కోట్ల రూపాయలు గ్రాంట్లుగా కేంద్రం నుండి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం చూపించింది. దాదాపు అర్ధ సంవత్సర కాలం ముగుస్తుండగా ఇప్పటి వరకు వచ్చింది కేవలం నాలుగు వేల కోట్ల రూపాయలు మాత్రమే కావడం గమనార్హం. అంచనా వేసిన మొత్తంలో నాల్గవ వంతు కూడా రాకపోవడం అధికార యంత్రాంగంలో చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా కేంద్రం ఇచ్చే గ్రాంట్లు, కేంద్రం పన్నుల్లో వాటా నిధులే రాష్ట్రానికి కీలకంగా ఉంటాయి. ఈ నిధుల ఆధారంగానే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించు కుంటున్నారు. అయితే, ఆ నిధుల్లోనే భారీగా కోత పడుతుండటం అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. వారు చెబుతున్న లెక్కల ప్రకారం రావాల్సిన మొత్తంలో కేవలం 12 శాతం మాత్రమే ఇప్పటి వరకు కేంద్ర నిధులు రాష్ట్రానికి అందాయి. ఆరునెలల కాలానికి 50 శాతం నిధులు రావాల్సిఉండగా, 25 శాతం కూడా రాకపోవడం గమనార్హం. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా కూడా ఇప్పటివరకు 42 శాతమే చేతికందింది. ఏడాది మొత్తానికి రూ.40,807 కోట్లు రావాల్సి ఉండగా, ఆరు నెలల్లో రూ.17,187 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రం కీలకంగా ఉన్నప్పటికీ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు పట్టించుకోవడం లేదని, కేంద్రంపై వత్తిడి తేలేకపోతున్నారని విమర్శలు ఉన్నాయి. దీనిని అలుసుగా తీసుకుంటున్న కేంద్రం కూడా నిధుల ఎగవేతకు పాల్పడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మిగిలిన ఆదాయాన్ని చూసినా అన్ని రంగాల్లోనూ లక్ష్యానికన్నా తక్కువగా నిధులు సమకూరాయి. పన్నేతర ఆదాయం కేవలం 13 శాతంగానే నమోదైంది. ఆదాయ లోటు 140 శాతానికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోందని అధికారులు అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నులు, గ్రాంట్లు ద్వారా రూ.2.17 లక్షల కోట్లు వస్తాయని అంచనా వేయగా, 74 వేల కోట్లు మాత్రమే వచ్చాయి.

భారీగా రుణం

అంచనా మేరకు కేంద్రం నుండి నిధులు కారపోవడంతో రూ.63 వేల కోట్లు రుణం తీసుకోవాల్సివచ్చింది. ఫలితంగా బడ్జెట్‌లో రూ.79,926 కోట్లు రుణం తీసుకోవాలని ప్రతిపాదించగా, ఆరు నెలల్లోనే 78 శాతానికి పైగా రుణం సేకరించాల్సి వచ్చింది. దీంతో మిగిలిన ఆరు నెలలకు తీసుకునేందుకు అవకాశం ఉన్న రుణం కేవలం రూ.17 వేల కోట్ల వరకు మాత్రమే ఉన్నట్లు తేలింది.

పెరుగుతున్న ఆదాయ లోటు

ఆదాయం కన్నా వ్యయం ఎక్కువగా ఉండడంతో లోటు కూడా ఆదే స్థాయిలోకి చేరుకుంటోంది. ఈ ఏడాది ఆదాయ లోటు రూ.33,185 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేయగా, తొలి ఆరు నెలలకే రూ.46,652 కోట్లకు లోటు చేరుకోవడం గమనార్హం. ద్రవ్య లోటు కూడా రూ.79,926 కోట్లు ఉంటుందని అంచనా వేయగా, ఇప్పటికే రూ.62 వేల కోట్లు వరకు పెరిగిపోయింది.



ఆశా వర్కర్ల ర్యాలీ అగ్ర భాగంలో ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, కె సుబ్బరావమ్మ తదితరులు

కనీస వేతనం కోసం ఉద్యమం

- అనకాపల్లిలో ఆశా వర్కర్స్ రాష్ట్ర మహాసభలో వక్తలు
- భారీ ర్యాలీ, సభ

2

మంత్ర ముగ్ధులను చేసిన ఇళయరాజా సంగీత విభావరి



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీత విభావరి నగర వాసులను మంత్ర ముగ్ధులను చేసింది. ట్రెండ్ సెట్టర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం రాత్రి 'మ్యూజికల్ మంత్రం (మ్యూజికల్ లైవ్ కాన్సర్ట్)' పేరుతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇళయరాజా స్వరపరచిన గీతాలను 80 మంది సంగీత వాయిద్య కళాకారులతో ఆలపించిన గీతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాత, కొత్త పాటలతో ఇళయరాజాతో పాటు ఆయన బృందం ఆలపించిన గీతలు ప్రేక్షకులను మంత్రం ముగ్ధులను చేశాయి. నగరంలో తొలిసారిగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఎగుమతుల హబ్‌గా 'కుప్పం'

ఒకే రోజు ఏడు పరిశ్రమలకు వర్చువల్‌గా సిఎం చంద్రబాబు శంకుస్థాపన



వర్చువల్‌గా శంకుస్థాపన చేసి ప్రసంగిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి- కుప్పం (చిత్తూరు జిల్లా), అమరావతి బ్యూరో

ఎగుమతుల హబ్‌గా కుప్పం నియోజవర్గం మారనుందని ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ నియోజకవర్గంలో ఒకే రోజు ఏడు పరిశ్రమలకు వర్చువల్‌గా శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ఈ పరిశ్రమల కోసం 241 ఎకరాల భూమిని ఇస్తున్నామని, రూ.2,203 కోట్ల పెట్టుబడులు రానున్నాయని, వీటివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,300 మందికి ఉపాధి లభించనుందని ప్రకటించారు. స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, ఎరో స్పేస్ సిటీలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అందుకు అవసరమైన పెట్టుబడులు ఆకర్షించేందుకు, పరిశ్రమల స్థానకు కృషి చేస్తామని తెలిపారు. ఒకప్పుడు కుప్పం అత్యంత వెనుకబడిన ప్రాంతమని, ఇప్పుడు అభివృద్ధి చెందుతోందని అన్నారు. హిందాల్కో, శ్రీజా డెయిరీ, ఏస్ ఇంటర్నేషనల్, ఎస్‌విఎఫ్ సోయా, మదర్ డెయిరీ రానున్నాయని వివరించారు.

పారిశ్రామికవేత్తలుగా లక్ష మంది మహిళలు

ఈ ఆర్థిక సంవత్సరంలో డ్వాక్రా, మెప్మా సంఘాల నుంచి లక్ష మందిని మహిళా పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. కుప్పం నియోజకవర్గాన్ని వంద శాతం సోలార్ పవర్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. త్వరలో రూ.6,339 కోట్ల పెట్టుబడితో 8 సంస్థలు కుప్పానికి రానున్నాయన్నారు. దీంతో, ప్రత్యక్షంగా, పరోక్షంగా 43 వేల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. సంజీవని పైలట్ ప్రాజెక్టును కుప్పంలోనే తొలుత అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, కుప్పం ఏరియా డవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్‌టిసి వైస్‌చైర్మన్ మునిరత్నం, పికెఎం ఉడా చైర్మన్ సురేష్‌బాబు, రెస్కో చైర్మన్ ప్రతాప్ పాల్గొన్నారు.

అమరావతిలో ఎలివేటెడ్ కారిడార్



- ఉండవల్లి నుండి మణిపాల్ ఆస్పత్రి వరకు
- జాతీయ రహదారితో అనుసంధానం

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతిలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నారు. రాజధాని నుండి విజయవాడ నగరానికి నేరుగా కనెక్టివిటి ఏర్పాటు చేసే చర్యల్లో భాగంగా దీనిని చేపట్టనున్నారు. ఉండవల్లి సమీపంలోని కొండవీటి వాగు లిఫ్ట్ సమీపంలో ప్రారంభమయ్యే ఈ కారడార్ మణిపాల్ ఆస్పత్రి వద్ద 16వ నెంబర్ జాతీయ రహదారితో కలవనుంది. ఈ మేరకు ఆర్వీ అసోసియేట్స్ రూపొందించిన మాస్టర్‌ప్లాను కాపీ ప్రజాశక్తికి అందింది. దీని ప్రకారం ఉండవల్లి సమీపంలోని కొండవీటివాగు లిఫ్టు సమీపంలో ఉన్న గుంటూరు పంపింగ్ స్టేషన్ ట్యాంకు వెనుకభాగం నుండి కారిడార్ ప్రారంభమవుతుంది. ఇక్కడ దీనికి జంక్షన్ ఏర్పాటు చేయనున్నారు. అక్కడ నుండే రెండోవైపు ప్రస్తుతం కొండవీటివాగుకు కృష్ణాపశ్చిమ కాలువ దగ్గర నిర్మించిన గేట్ల పక్కనే మరో స్టీల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. దీనికోసం ఇటీవల పిల్లర్లు కూడా వేశారు. ఈ బ్రిడ్జి కెఎల్‌రావు కాలనీ వైపు పాత జాతీయ రహదారిపై దిగుతుంది. దీనికోసం అక్కడ నివాసాలు ఖాళీ చేయాలని ఇటీవల మున్సిపల్ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. కృష్ణా పశ్చిమ కాలువపై ఉండవల్లి వద్దనున్న వంతెన మీదుగా నిర్మాణం జరుగుతుంది. సీతానగరం కొండకు దక్షిణ భాగానికి ఆనుకుని బోట్‌యార్డు మీదుగా. కొల్‌కతా చెన్నై ట్రంక్‌రైల్వే లైను దాటుకుని కారిడార్‌ను నిర్మించనున్నట్లు మాస్టర్ ప్లానులో చూపించారు. దీనికోసం అక్కడ ఆర్‌ఓబి నిర్మించనున్నారు. అనంతరం ఎన్‌టిఆర్ కట్టమీదుగా మణిపాల్ ఆస్పత్రి వద్ద 16వ నెంబరు జాతీయ రహదారిపై కలుపనున్నారు. దీనికోసం అక్కడ ట్రంపెట్ సర్కిల్ ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు త్రీఆర్మ్ రోడ్డు నిర్మిస్తారు. దీనిలో ఒకటి విజయవాడ వైపుకు, రెండోది గుంటూరు వైపునకు

మిగతా 6లో

1 నుంచి 19 వరకు పార్లమెంటు సమావేశాలు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబరు 1 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారని శనివారం సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. లోక్‌సభ సెక్రటేరియట్ ప్రకటన విడుదల చేసింది. 'భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశలో, ప్రజల ఆకాంక్షలకు ఉపయోగపడే నిర్మాణాత్మక, అర్థవంతమైన సమావేశాల కోసం ఎదురు చూస్తున్నా' అని కిరణ్ రిజిజు పోస్టు చేశారు. మొత్తం 19 రోజుల్లో సాగే ఈ సమావేశాల్లో 15 రోజులు ఉభయ సభలు భేటీ కానున్నాయి. బీహార్ ఎన్నికల ఫలితాల అనంతరం జరిగే ఈ సెషన్‌లో కీలకమైన రాజ్యాంగ (130వ) సవరణ బిల్లు - 2025, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు, జమ్ము కాశ్మీర్ పున:వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, ఇతర బిల్లులను ఉభయ సభల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం యోచిస్తోంది. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), హర్యానా, మహారాష్ట్రలో ఓట్ల చోరీపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధంగా ఉన్నాయి. గతంలో శీతాకాల సమావేశాలు నవంబరు మూడో వారంలో మొదలై, క్రిస్మస్ (డిసెంబరు 25)కు ముందు ముగిసేవి. గతేడాది నవంబరు 25న ప్రారంభమై డిసెంబరు 20తో ముగిశాయి.

పార్లమెంటు శీతాకాల సమావేశాల పని దినాలను తగ్గించడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. 'ఇది అసాధారణమైన నిర్ణయం. ఈ షార్ట్ సెషన్‌తో ఏ సందేశం ఇవ్వాలనుకుంటు న్నారు. కేంద్ర ప్రభుత్వానికి బిల్లుల సవివరమైన చర్చ, ఆమోదం, సభ సజావుగా నిర్వహించాలనే ఆలోచన లేదు' అని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ (కమ్యూనికేషన్), రాజ్యసభ పార్టీ చీఫ్ విప్ జైరామ్ రమేష్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రధాని మోడీ టీమ్‌కు 'పార్లమెంట్ ఫోబియా' పట్టుకుందని, పార్లమెంట్‌ను నడపలేక భయపడుతోందని టిఎంసి రాజ్యసభ పార్లమెంటరీ పార్టీ నేత డెరెక్ ఒబ్రాయిన్ పేర్కొన్నారు.

వందేభారత్‌లో హిందూత్వ ప్రచారం సరి కాదు

- కేరళ సిఎం పినరయి విజయన్

7

కురుబల గుడికట్ల పూజారులకు గౌరవవేతనం

- ఆర్‌డిటి లైసెన్సు పునరుద్ధరణకు చర్యలు
- భక్త కనకదాస జయంతి సభలో మంత్రి నారా లోకేష్

3


ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మహాసభ ప్రారంభంలో యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యవతి, చిత్రంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, కె సుబ్బరావమ్మ తదితరులు


రంజన నిరుల, సీతారాం ఏచూరి, నాగలక్ష్మి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, ఉమామహేశ్వరరావు తదితరులు

కనీస వేతనం కోసం ఉద్యమం

- స్కీం వర్కర్లపై పాలకుల నిర్లక్ష్యం
- పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం
- అనకాపల్లిలో ఆశా వర్కర్స్ రాష్ట్ర మహాసభలో వక్తలు
- భారీ ర్యాలీ, సభ

ప్రజాశక్తి- అనకాపల్లి

కనీస వేతనాల అమలు, ఉద్యోగ భద్రత ప్రధాన అజెండాలుగా స్కీం వర్కర్లు ఉద్యమించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఐదో రాష్ట్ర మహాసభ అనకాపల్లి వర్తక సంఘం కర్రి రమేష్ కల్యాణ వేదికలో శనివారం ప్రారంభమైంది. రెండు రోజులపాటు సాగే ఈ మహాసభకు రాష్ట్ర నలుమూలల నుంచి ఆశా వర్కర్లు తరలివచ్చారు. తొలుత అనకాపల్లిలోని సిఐటియు జిల్లా కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్, నెహ్రూ చౌక్ జంక్షన్, మెయిన్ రోడ్ మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎర్రజెండాలు చేబూని ఆశా కార్యకర్తలు కదంతొక్కారు. అనంతరం నాలుగు రోడ్ల జంక్షన్లో జరిగిన బహిరంగ సభలో ముఖ్య అతిథి గోపిమూర్తి మాట్లాడుతూ ఆశా వర్కర్లను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ సాగిన రైతు ఉద్యమాన్ని స్ఫూర్తిగా సమస్య పరిష్కారానికి ఆశా వర్కర్లు పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు అవకాశవాద విధానాలతో ముందుకు సాగుతున్నాయన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరిస్తున్నాయని, కార్మికోద్యమాలపై ఉక్కు పాదం మోపుతున్నాయని వివరించారు. కార్మికుల పని గంటలను ఎనిమిది నుంచి 13 గంటలకు పెంచినా వైసిపి మాట్లాడడం లేదన్నారు. స్కీం వర్కర్లకు పోరాటానికి పిడిఎఫ్ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు.

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఆశా వర్కర్లు నేషనల్ హెల్త్ మిషన్‌లో అతి తక్కువ పారితోషికంతో మాతా, శిశు సంరక్షణకు పని చేస్తున్నారని తెలిపారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసర సేవలందించాలని ఆశాలపై ఒత్తిడి తీసుకురావడం సరికాదన్నారు. ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బేటీ బచావో... బేటీ పడావో నినాదాలు ఇస్తున్న ప్రధాని మోడీకి స్కీం వర్కర్ల సమస్యలు పట్టవా? అని ప్రశ్నించారు. వేతనాలు చాలక ఫైనాన్స్ సంస్థలు, వ్యక్తుల వద్ద తీసుకున్న అప్పులు చెల్లించలేక ఆశాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంఘం ఆధ్వర్యాన జరిగిన పోరాటాలు, సాధించిన విజయాలను వివరించారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనలో మోడీ విఫలమయ్యారన్నారు. అధికారంలోకి వస్తే స్కీం వర్కర్ల జీతాలు పెంచుతామని చెప్పిన చంద్రబాబు... ఆ మాటను విస్మరించారన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పోశమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివి.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రతినిధుల సభ ప్రారంభం

అనకాపల్లి వర్తక సంఘం కర్రి రమేష్ కల్యాణ వేదికలో నాగలక్ష్మి నగర్‌లో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతినిధుల సభ ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యవతి సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి, నాగలక్ష్మి, రంజన నిరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి అందరూ ఘనంగా నివాళ్లర్పించారు. ప్రతినిధుల సభకు అధ్యక్ష వర్గంగా కె.పోశమ్మ, పి.ధనశ్రీ, వి.సత్యవతి, డి.అన్నపూర్ణ, రమణ కుమారి వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శి నివేదికను కె.ధనలక్ష్మి ప్రవేశపెట్టారు. కనీస వేతనాలు ఇవ్వాలని, ఆశాలను పర్మినెంట్ చేయాలన్న తీర్మానాన్ని పి.ధనశ్రీ ప్రవేశపెట్టగా పశ్చిమగోదావరి డి.జ్యోతి బలపరిచారు. మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.


ఇంద్ర ఎసి బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి టిజి.భరత్

కర్నూలు నుంచి విశాఖకు మూడు ఇంద్ర బస్సులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజలందరూ తమ ప్రయాణ అవసరాలకు ఆర్‌టిసి బస్సులనే వినియోగించుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి భరత్ కోరారు. శనివారం కర్నూలు ఆర్‌టిసి వన్ డిపో గ్యారేజీ నుంచి విశాఖపట్నానికి మూడు ఇంద్ర ఎసి బస్సులను ఆయన పారంభించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ..పర్యాటక ప్రదేశాలను తిలకించేందుకు ఇంద్ర సర్వీసులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఆర్‌టిసి ఆర్ఎం టి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కర్నూలు నుంచి ఇంద్ర బస్సు ప్రతిరోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు విశాఖపట్నం చేరుతుందన్నారు. విశాఖపట్నంలో మధ్యాహ్నం 2.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని తెలిపారు. అతి త్వరలో కర్నూలుకు 50 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని చెప్పారు. ఈ కార్యాక్రమంలో డిపో మేనేజర్లు కె.సుధారాణి, కెఎల్‌కె. శర్మ పాల్గొన్నారు.

మాజీ మంత్రి అప్పలరాజుకు నోటీసులు

- కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో విచారణ

ప్రజాశక్తి - పలాస

ఓ కేసుకు విషయమై మాజీ మంత్రి, వైసిపి నాయకులు సీదిరి అప్పలరాజుకు కాశీబుగ్గ పోలీసులు శనివారం నోటీసులు అందజేశారు. అప్పలరాజు ఇంటికి కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ వచ్చి స్టేట్‌మెంట్ తీసుకుంటారని చెప్పినా సిఐ రాకపోవడంతో ఆయనే కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు.

రాత్రి తొమ్మిది గంటల వరకు విచారణ చేపట్టిన పోలీసులు అనంతరం విడుదల చేశారు. ఏడాది కిందట పలాస మండలం కిష్టుపురానికి చెందిన బూర్లె విజయ్ కృష్ణంరాజు ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పుడు నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టారు. వైసిపి పట్టణాధ్యక్షులు శిష్టు గోపికి కూడా నోటీసులు ఇచ్చి విచారణకు ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాలని తెలిపారు.

వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. ఆ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి వైసిపి ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రరెడ్డి, ఎపి జెఎసి అధ్యక్షులు కాకర్ల వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె జాలిరెడ్డి, జంషీద్‌లను, స్టేట్ ట్రెజరర్‌గా ప్రేమ్‌సాగర్‌ను ఎన్నుకున్నారు.

జాయింట్ ఎల్‌పిఎమ్‌లతో అన్నదాతకు కష్టాలు

- డూప్లికేట్ ఖాతాలు, జాయింట్ ఎల్‌పిఎమ్‌లు 5.14 లక్షలు గుర్తింపు
- దిద్దుబాటు చర్యలకు దిగిన ప్రభుత్వం
- మార్గదర్శకాలు విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూములు రీసర్వే చేసిన గ్రామాల్లో అధికారులు వ్యవహరించిన ఉదాసీన వైఖరి, క్షేత్రస్థాయిలో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో భూముల రీసర్వే చేసిన ఫలితం నేడు అన్నదాతకు కష్టంగా మారింది. రీసర్వే గడువులోగా పూర్తి కావాలనే లక్ష్యాలను చేరుకునే క్రమంలో అనేక మంది భూ యజమానులకు కలిపి ఒకే జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాపింగ్ (ఎల్‌పిఎమ్) నెంబరు కేటాయించారు. దీంతో డూప్లికేట్ ఖాతాలు కూడా ఎక్కువ నమోదు చేయడంతో అన్నదాతల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. రాష్ట్ర వ్యాప్తంగా 2023 డిసెంబరు నాటికి 6,688 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయ్యింది. నేటికీ ఆయా గ్రామాల్లో భూములకు సంబంధించి ఎల్‌పిఎమ్‌లు సక్రమంగా లేవు. దీంతో రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. జాయింట్ ఎల్‌పిఎమ్‌లు, డూప్లికేట్ ఖాతా నెంబర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 3వ తేదీ నాటికి 5,14,040 వరకు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అయితే ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేయదలుచుకున్న ఇ-పాస్ పుస్తకాలు అత్యధిక శాతం కార్యాలయాల్లోనే ఉన్నట్లు సమాచారం. భూమిపై గట్లు లేకపోవడం, సబ్ డివిజన్ రికార్డు అందుబాటులో లేకపోవడం, రైతుల అయిష్టత, విస్తీర్ణంలో వ్యత్యాసాలతో పాటు క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులతో ఉమ్మడి ఎల్‌పిఎమ్‌లు సృష్టించినట్లు అధికార యంత్రాంగం పేర్కొంటోంది. జాయింట్ ఎల్‌పిఎమ్‌లతో బ్యాంకులో రుణాలు పొందాలన్నా, సబ్ డివిజన్ అయిన భూమిని అమ్ముకోవాలన్నా వీలు లేకపోవడంతో ఆయా భూ యజమానులు గత రెండున్నరేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. రికార్డులను సరిచేయాలని అన్నదాతలు, ప్రజాసంఘాలు, రైతు, కౌలు రైతు సంఘాల ఒత్తిడితో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు వీలుగా శనివారం మార్గదర్శకాలను సూచించింది.

తప్పులను సరిదిద్దేందుకు..

ప్రతి గ్రామంలో ఉమ్మడి ఎల్‌పిఎమ్‌లను చేయదగినవి, చేయలేనివి కేటగిరీలుగా విభజించాలి. చేయదగిన వాటికి సంబంధించి వ్యక్తిగత భూమిని గుర్తించడానికి సర్వే చేయడంలో గట్లు ఉండి వ్యక్తిగత ఎల్‌పిఎమ్ నమోదు చేయని వాటిని గుర్తించడం, గ్రౌండ్ ట్రూ థింగ్ సమయంలో భూ యజమానులు గైర్హాజరు లేదా అసమ్మతిగా ఉన్నవాటితో పాటు భూమిపై హద్దులు కనబడకపోయినా ఉమ్మడి తోటల పెంపకం, ఉమ్మడి వ్యవసాయం, చేపల చెరువులు వంటి వాటి విషయంలో ఉమ్మడి ఎల్‌పిఎమ్‌లకు సంబంధించిన అందరూ భూ యజమానుల సమ్మతితో వ్యక్తిగత ఎల్‌పిఎమ్‌లు ఏర్పాటు చేయవచ్చని ప్రభుత్వం మార్గదర్శనం చేసింది. వ్యక్తిగతంగా భూమిని గుర్తించడానికి భూమిపై గట్లు లేకపోయినా, వ్యక్తిగత ఎల్‌పిఎమ్ ఎఫ్ఎమ్‌బిలోని ఉప విభాగాన్ని ప్రతిబింబిస్తున్నట్లయితే అటువంటి వాటికి కూడా ఎల్‌పిఎమ్ ఇవ్వొచ్చని ప్రభుత్వం సూచిస్తోంది.

ఉమ్మడి ఎల్‌పిఎమ్‌ల విభజన ఇలా..

ఎల్‌పిఎమ్‌లకు విభజన, సబ్ డివిజన్ అవసరమైన గ్రామాల జాబితాను తొలుత తయారు చేయాల్సి ఉంటుంది. వరుసగా రెండు గ్రామసభలను నిర్వహించడానికి షెడ్యూల్‌ను సిద్ధం చేయాలి. భూ యజమానులను గ్రామసభలకు ఆహ్వానించాలి. మండల్ మొబైల్ మెజిస్ట్రేట్ బృందం, గ్రామ సర్వేయరు ప్రతి వ్యక్తి భూ యజమానికి ఉమ్మడి ఎల్‌పిఎమ్‌ల విభజన, ప్రయోజనాలు, సంక్షేమ పథకాల కోసం వ్యక్తిగత సంక్షేమం గురించి వివరించాలి. ఉమ్మడి ఎల్‌పిఎమ్‌ల విభజనకు ఇచ్చే ఎల్‌పిఎమ్‌ల కాపీలతో గ్రామ సర్వేయరు హాజరుకావాల్సి ఉంటుంది. గ్రామ సర్వేయరు దరఖాస్తులను స్వీకరిస్తారు. ఉమ్మడి ఎల్‌పిఎమ్‌ల భూ యజమానుల మధ్య ఏకాభిప్రాయం తీసుకొచ్చేందుకు కృషి చేయాలి.

వ్యక్తిగత భూ పార్శిల్ కలిగి ఉంటే కలిగే ప్రయోజనాలను వివరించాలి. గ్రామ సర్వేయరు ఆన్‌లైన్ సబ్ డివిజన్ ప్రక్రియలో పేర్కొన్న విధానం ప్రకారం ఎల్‌పిఎమ్‌లు వేరు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు సూచించింది.



ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న పవన్‌కల్యాణ్

ఎర్రచందనం స్మగ్లింగ్‌లో నలుగురు కింగ్‌పిన్

- త్వరలో అదుపులోకి తీసుకుంటాం : పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ఎర్రచందనం స్మగ్లింగ్‌లో నలుగురు కింగ్ పిన్‌లను గుర్తించామని, త్వరలోనే వారిని అదుపులోకి తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేయాలంటే భయపడే విధంగా 'ఆపరేషన్ కగార్' లాగా ఓ ఆపరేషన్ చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని చెప్పారు. తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా శనివారం రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా మామండూరు అటవీ ప్రాంతానికి అధికారులతో కలిసి ఆయన వెళ్లారు. స్మగ్లర్లు నరికి వేసిన ఎర్రచందనం చెట్లను పరిశీలించారు. వ్యూ పాయింట్ ద్వారా మామండూరు అటవీ ప్రాంతాన్ని, అటవీ శాఖకు చెందిన కేంద్రీయ ఎర్రచందనం దుంగలను పరిశీలించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. అటవీ శాఖ మంత్రిగా తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత శేషాచలం అడవుల నుండి తరలిపోయిన ఎర్రచందనం ఏ రాష్ట్రంలో ఉన్నా మనకు స్వాధీనపరిచేలా సమన్వయం చేసుకుంటూ వస్తున్నామన్నారు. ఎర్రచందనం చెట్లు నరకడానికి వస్తే వారి తాట తీస్తామన్నారు. స్మగ్లర్లు ఇదే హెచ్చరికగా భావించి, వేరొక పనులు చేసుకోవాలని, తమిళనాడు నుంచి వచ్చే కూలీలు స్మగ్లింగ్ చేయడానికి రాకుండా వారిలో మార్పు తీసుకురావడం వంటి కార్యక్రమాలను చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎనిమిది వేల కోట్ల నుంచి పది వేల కోట్ల రూపాయల ఎర్రచందనం దోచుకున్నారని ఆరోపించారు. పవన్ కల్యాణ్ వెంట అటవీ శాఖ ప్రిన్సిపల్ పిసిసిఎఫ్ చలపతిరావు, ప్రభుత్వ అటవీ శాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఒఎస్‌డి శివరాంప్రసాద్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్‌పి, టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

అత్తను చంపిన కోడలు

- వీడియోలు చూసి ఘాతుకానికి పాల్పడ్డ వైనం


మృతురాలు కనకమాలక్ష్మి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - పెందుర్తి (విశాఖపట్నం)

అత్తను ఎలా చంపాలి అనే విషయమై యూట్యూబ్‌లో వీడియోలు చూసి పథకం ప్రకారం ఆమెను హతమార్చింది కోడలు. విశాఖ జిల్లా అప్పన్నపాలెంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. కేసు వివరాలను ఎసిపి పృథ్వీతేజ్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... అప్పన్నపాలెం గ్రామం వర్షిణి అపార్టుమెంట్‌లో జయంతి సుబ్రహ్మణ్యం, అతని భార్య లలితాదేవి, కుమార్తె శ్రీనారాయణ, తల్లి కనకమాలక్ష్మి ఉంటున్నారు. సుబ్రహ్మణ్యం పురోహిత్యం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంతో కనకమాలక్ష్మి మరణించారు. అనుమానంతో తన తల్లి మృతి పట్ల పోలీసులకు సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అక్కడ ఒక చైర్‌కు తాడు కట్టి ఉండడంతో అనుమానం వచ్చి కనకమాలక్ష్మి కోడలు లలితా దేవిని అదుపులో తీసుకొని తమదైన శైలిలో విచారించారు. చివరకు తానే హత్య చేసినట్టు లలితా దేవి ఒప్పుకున్నారు.


ప్రమాదానికి కారణమైన కారు

ప్రయాణికులపైకి దూసుకెళ్లిన కారు

- ముగ్గురు మృతి, ఏడుగురికి గాయాలు
- టైరు పేలడంతో ఘటన

ప్రజాశక్తి - జగ్గంపేట(కాకినాడ జిల్లా)



మోర్త కొండయ్య , మోర్త ఆనందరావు (ఫైల్)


కాకాడ రాజు (ఫైల్)

కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో కారు బీభత్సం సృష్టించింది. బస్సు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులపై అమాంతం దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అన్నవరం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు పెళ్లి బృందం కారు 216వ నంబరు జాతీయ రహదారి మీదుగా వెళ్తోంది. కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చేరుకునే సరికి కారు ముందు టైరు పేలిపోయింది. దీంతో అదుపుతప్పి హైవే బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. అంతటితో ఆగకుండా రెండు బైకులు, రిక్షాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోమవరం గ్రామానికి చెందిన మోర్త ఆనందరావు (79), మోర్త కొండయ్య (30), ఏలేశ్వరం గ్రామానికి చెందిన బొప్పాయి వ్యాపారి కాకాడ రాజు (60) అక్కడికక్కడే మృతి చెందారు.

కొండ్రపు చైతన్య, చీపురుపల్లి స్రవంతి, బత్తిన భద్రరావు తీవ్రంగా గాయపడ్డారు. మరో నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ప్రత్తిపాడు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు.

48 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు?

- పెన్షన్ల పంపిణీలో పాల్గొనక పోవడంపై చంద్రబాబు ఆగ్రహం
- కొందరు ఎంఎల్‌ఏలు పార్టీ సీనియర్లను పట్టించుకోవడం లేదంటూ అసంతృప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెన్షన్ల పంపిణీ కార్యక్రమాలకు హాజరుకాని 48మంది ఎంఎల్‌ఏలకు నోటీసులు ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆదేశించినట్లు సమాచారం. టిడిపి కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పార్టీ కార్యాలయ విభాగాలతో చంద్రబాబు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. ఎన్ని సార్లు చెప్పినా కొందరు ఎంఎల్‌ఏలు పెన్షన్లు, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని ఆయన అన్నట్లు సమాచారం. అటువంటి వారిని ఉపేక్షించవద్దని , నోటీసులు పంపి వివరణ తీసుకోవాలని, ఆ తరువాత అవసరమైతే చర్యలకు సైతం వెనుకాడవద్దని టిడిపి నాయకత్వాన్ని ఆయన ఆదేశించినట్లు తెలిసింది. పేదలకు సేవలో కార్యక్రమానికి క్రమం తప్పకుండా తాను హాజరవుతానని తెలిపారు. నాయకులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలకు నాయకులు తప్పనిసరిగా హాజరై క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. అదేవిధంగా కొందరు ఎంఎల్‌ఏలు సీనియర్లను విస్మరిస్తూ కొత్తవారికి ప్రాధాన్యత ఇస్తున్న అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. క్షేత్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటున్నా, సీనియర్లను, పార్టీ శ్రేణులను పక్కనబెట్టి కొత్తగా బయట నుంచి వచ్చిన వారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం సరికాదు' అని ఆయన అన్నారు. సీనియర్లను కూడా కలుపుకొని పోవాలని ఎమ్మెల్యేలకు సూచించారు. పార్టీ కార్యకర్తల బీమాకు సంబంధించిన లెటర్లు ఇంకా అందించని వారి వివరాలను సేకరించి తనకు అందజేయాలని చెప్పారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి ప్రతి నాయకుడు ప్రత్యేక సమయం కేటాయించాలని కోరారు. ప్రతి ప్రజాప్రతినిధి వారంలో ఒక రోజు ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ప్రత్యక్షంగా అర్జీలు స్వీకరించాలని ఆదేశించారు.

22ఎ నిషేధిత భూములపై త్వరలోనే నిర్ణయం

రాష్ట్రంలో 22ఎ నిసేధిత జాబితా భూములపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు చెప్పారు. గ్రీవెన్స్ నిర్వహిస్తున్న సమయంలో తనను కలిసిన మీడియాతో ప్రతినిధులతో ఆయన కొంతసేపు మాట్లాడారు. గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల రెవెన్యూ అంశాలు సంక్లిష్టంగా మారాయని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను ముందు పరిష్కరించాల్సి ఉందని, దీనిపై ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

11 నుంచి బిఎల్‌ఒలకు 'ఎస్ఐఆర్' శిక్షణ

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) - 2026 అమలు కోసం ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసరు వివేక్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన అన్ని జిల్లాల అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ప్రధాన ఎన్నికల అధికారి, సాంకేతిక బృందంతో కలిసి 2022 రోల్‌తో 2025 ఓటర్ల మ్యాపింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎపి స్వాన్ నెట్‌వర్క్ ద్వారా ఇఆర్ఒఎస్, ఎఇఆర్ఒఎస్, బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లకు సంబంధిత ఇఆర్ఒ/ఎఇఆర్ఒ కార్యాలయాల నుంచి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 11, 12, 13, 14 తేదీల్లో ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. 11న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు, 12న కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, ఎన్‌టిఆర్, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాలకు, 13న గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, 14న కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. షెడ్యూల్ ప్రకటించిన తేదీల్లో ఆయా ఎన్నికల అధికారులు వారి వారి స్థానాల్లో తప్పనిసరిగా వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరుకావాలని వివేక్ యాదవ్ తెలిపారు.

రైతులకు పావలా వడ్డీకే రుణాలు

- ఎక్కువ కౌలు చేస్తూ ఆత్మహత్యలు చేసుకుంటున్న కౌలు రైతులు
- ఎన్‌జి రంగా 125 జయంతి సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు పావలా వడ్డీకే రుణాలు అందించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి ఒక్క విషయంలో రైతులకు అండగా ఉంటామన్నారు. ఆచార్య ఎన్‌జి రంగా 125వ జయంత్యుత్సవాలు గుంటూరు జిల్లాలోని ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కౌలు రైతులు ఎక్కువ భూమి తీసుకొని కౌలు చేస్తూ అప్పులెక్కువ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వస్తున్నారని వివరించారు. కౌలు ఎంత చేయగలుగుతామో అంతే చేయాలని చెప్పారు. కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు వస్తాయని, ఆత్మహత్యలు ఒక్కటే పరిష్కారం కావని, ఈ విషయాన్ని రైతాంగమంతా గుర్తుంచుకోవాలని కోరారు. వరదలు, విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలా ముందుకు పోతున్నామని చెప్పారు. రైతులు రెండు సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఒకటి కరువు కాగా, మరొకటి తుపానులు అని తెలిపారు. మూడో కారణం పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడమని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 95 శాతం పంటల బీమా చెల్లించామని, మిగిలిన బీమాను ఈ నెల 12వ తేదీలోపు పూర్తిచేస్తామన్నారు. తమ ప్రభుత్వం సమర్థ నీటి నిర్వహణ, ముందస్తు చర్యల వల్ల రిజర్వాయర్లు 95 శాతం నిండాయని వివరించారు. వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు, నరసరావుపేట ఎంపి లావు కృష్ణదేవరాయలు ప్రసంగించిన ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలెక్టరు తమీమ్ అన్సారియ, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, గళ్లా మాధవి తదితరులు పాల్గొన్నారు. ఎన్‌జి రంగా జీవితమంతా స్వాతంత్ర్య సాధనకు, రైతు సంక్షేమానికి కృషి చేశారని చెప్పారు. ఈ సందర్భంగా ఆధునిక రాజ్యాంగ సంస్థల పుస్తకాన్ని సిఎం ఆవిష్కరించారు. అంతకముందు రైతు కె రామకృష్ణ, శాస్త్రవేత్త కె శ్రీనివాస్‌ను సిఎం చంద్రబాబు సత్కరించారు.

ఉన్నతాధికారులకు డిజిటల్ అరెస్ట్ గుబులు

- నంబర్లు బ్లాక్ చేసుకుంటున్న తాజా, మాజీ ఐఏఎస్‌లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొంతకాలంగా సంచలనం సృష్టిస్తున్న డిజిటల్ అరెస్ట్ మోసాలు సాధారణ ప్రజల నుంచి ఉన్నతాధికారుల వరకు పాకాయి. ఉన్నతాధికారులను కూడా ఈ భయాలు వెంటాడుతున్నాయి. మీరు తప్పుచేసినట్లు మా రికార్డుల్లో ఉందంటూ వస్తున్న కాల్స్ ఎక్కువైపోయినట్లు అధికారులు వాపోతున్నారు. తనకు ఇటువంటి కాల్స్ రోజుకు ఒకటైనా వస్తోందని గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి చెప్పడం విశేషం. గత ఏడాది కాలంగా డిజిటల్ అరెస్ట్ అన్న పేరు తరచూ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. చట్టాన్ని, న్యాయాన్ని పరిరక్షించే ఉన్నతస్థాయి సంస్థల ప్రతినిధులుగా ఫోన్ చేసిన వారు చెప్పుకుంటుండటంతో అధికారులు సైతం గందరగోళానికి గురవుతున్నారు. తొలిసారిగా నోయిడాలో ఈ తరహా మోసం వెలుగులోకి వచ్చింది. దానిపై ఆరా తీయడం ప్రారంభించినప్పటికీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఈ కేసులు విస్తరించినట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపై అనేక దఫాలుగా రిజర్వ్‌బ్యాంకు కూడా స్పందించి అసలు డిజిటల్ అరెస్ట్ అన్న పదం ఎక్కడా లేదని, ఎవరూ ఈ పేరుతో వేధించినా పట్టించుకోకుండా ఫిర్యాదులు చేయాలని తేల్చిచెప్పింది. కొద్ది నెలల క్రితమే రాష్ట్రానికి కూడా ఇటువంటి వాటిపై ముందస్తు హెచ్చరికలు రావడం గమనార్హం. తాజాగా ఐఏఎస్, ఐపిఎస్ స్థాయి అధికారులకు కూడా ఇవి విస్తరించినట్లు తెలుస్తోంది. పదవీ విరమణ చేసిన ఒక అత్యంత సీనియర్ ఐఏఎస్ అధికారికి ఇటీవల కాలంలో అనేక ఫోన్లు వచ్చినట్లు తెలిసింది. తనకే కాకుండా ఇతర అధికారులకు కూడా ఇటువంటివి వస్తున్నాయని, వారు కూడా తన వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించారని ఆయన చెప్పుకొచ్చారు. ఇలా వచ్చిన నంబర్లను బ్లాక్ చేసుకుంటున్నామని ఇతర అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకు ఇటువంటి కాల్స్‌పై ఉన్నతాధికారుల నుంచి సైబర్ పోలీసులకు మాత్రం పెద్దగా ఫిర్యాదులు వెళ్లలేదని తెలిసింది.

మృతి చెందిన న్యాయవాదుల కుటుంబాలకు రూ.46 కోట్లు పరిహారం

● మంత్రి ఎన్ఎండి ఫరూఖ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు పరిహారం అందించడంలో భాగంగా తమ ప్రభుత్వం రూ.46 కోట్లు నిధులు విడుదల చేసిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ, సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2020 ఏప్రిల్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మరణించిన 1,150 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు విడుదల చేసిన మ్యాచింగ్ గ్రాంట్‌ను ఏపి అడ్వకేట్స్ సంక్షేమ నిధి ఖాతాకు జమ చేస్తామని తెలిపారు. మరణించిన ఒక్కో న్యాయవాది కుటుంబానికి న్యాయవాదుల సంక్షేమ నిధి కమిటీ ఇచ్చే మొత్తానికి అదనంగా ప్రభుత్వం తరపున పరిహారంలో భాగంగా రూ.4 లక్షలు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పర్యవేక్షణలో మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు సంబంధించిన నామినీలకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండల పరిధిలోని ఉగ్గుముడిలో విషాదం చోటు చేసుకుంది. ఇద్దరు పిల్లలతో సహా తల్లి బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతులను వరలక్ష్మి (24) వర్షిత్ (4), ప్రశాంత్ (2)గా గుర్తించారు. మృతదేహాలను జెసిబి సాయంతో వెలికితీశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రబీ ఆశలపై నీళ్లు

● తుంగభద్ర ఆయకట్టుకు నీళ్లివ్వలేమని బోర్డు స్పష్టీకరణ
● 3.5 లక్షల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఈసారి అధిక వర్షాలు కురిసినా రబీలో తుంగభద్ర ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. గేట్ల మరమ్మతుల నేపథ్యంలో రబీ పంటలకు నీళ్లివ్వలేమని తుంగభద్ర బోర్డు అధికారులు ప్రకటించారు. ఈ విషయాన్ని శుక్రవారం జరిగిన కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జల వనరుల శాఖ అధికారులు స్పష్టం చేశారు. తుంగభద్ర జలాలపై రాయలసీమ జిల్లాల్లో ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి, ఆలూరు బ్రాంచ్ కెనాల్, కెసి కెనాల్ పరిధిలో 6.56 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో రబీ సీజన్‌లో 3.5 లక్షల ఎకరాల్లో పంటలు వేస్తుంటారు.

గతేడాది ఆగస్టులో తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో తుంగభద్ర దిగువ కాలువ కింద రబీలో ఆయకట్టు సాగు కాలేదు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది కొట్టుకుపోయిన గేటు స్థానంలో కొత్త గేటు ఏర్పాటుకు నిపుణుల కమిటీ సలహా మేరకు రూ.1.98 కోట్లతో టెండర్ పిలిచారు. టెండర్ దక్కించుకున్న గుజరాత్ కంపెనీ ఏప్రిల్ చివరి వారంలో డిజైన్స్ తయారు చేసింది. టిబి బోర్డు ద్వారా ఏపి సెంట్రల్ డిజైన్ కమిటీకి పంపినా ఆమోదానికి నెల రోజులు ఆలస్యం కావడంతో సకాలంలో గేటు తయారు చేసి బిగించలేకపోయారు. దీంతో, డ్యాం సామర్థ్యాన్ని 105 టిఎంసిల నుంచి 80 టిఎంసిలకు తగ్గించారు. గేటు తయారు చేసి బిగించేందుకు రెండు నెలల గడువు ఇచ్చారు. గేటును సిద్ధం చేసుకొని డ్యాం దగ్గరకు తీసుకొచ్చారు. జూన్‌లో డ్యాం ఎగువన భారీ వర్షాలు కురవడంతో దీనిని బిగించేందుకు సాధ్యం కాకపోవడంతో వాయిదా వేశారు. ఈ గేటుతోపాటు మిగిలిన 32 గేట్లను కూడా మార్చాలని నిర్ణయించారు. తయారీ టెండర్ దక్కించుకున్న గుజరాత్ కంపెనీ జూన్ నెల నుంచి ఇప్పటి వరకు 12 గేట్లను తయారు చేసింది. ఈ నెల 15 లోపు మిగిలిన గేట్లను సిద్ధం చేయనున్నట్లు డ్యాం ఇంజనీర్లు చెబుతున్నారు. రబీలో ఎల్ఎల్‌సి, హెచ్ఎల్‌సి, కర్ణాటక సాగు నీటి కాలువకు రోజుకు 0.89 టిఎంసిల చొప్పున నెలకు సుమారు 27 టిఎంసిల ప్రకారం వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు నీరు ఇవ్వాలంటే కనీసం 110 టిఎంసిలు అవసరం. ప్రస్తుతం 78 టిఎంసిలే ఉండడం, ఖరీఫ్ పంటలకు డిసెంబర్ నెలాఖరు వరకు నీరు ఇవ్వాల్సి ఉండడంతో రబీ పంటలకు నీరు ఇవ్వడం సాధ్యం కాదని తుంగభద్ర బోర్డు అధికారులు స్పష్టం చేశారు. దీంతో, రబీ సాగు ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. రబీకి నీరు ఇవ్వబోమని టిబి బోర్డు అధికారులు తెల్పిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని కర్నూలు కలెక్టర్ డాక్టర్ ఎ సిరి తెలిపారు.

సిఎం చొరవ తీసుకోవాలి



పలు ప్రాంతాల్లో అక్టోబర్ చివర్లో, నవంబర్‌లో పంటలు వేశారు. నీళ్లు ఇవ్వలేమని టిబి బోర్డు అధికారులు ఇప్పుడు చేతులెత్తేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతారు. రాష్ట్ర ప్రభుత్వం, సిఎం చొరవ తీసుకుని తుంగభద్ర బోర్డు అధికారులతో మాట్లాడి రబీకి నీళ్లిచ్చేలా చర్యలు తీసుకోవాలి. రైతుల పంటలను కాపాడాలి.

- జి.రామకృష్ణ, ఎపి రైతు సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి



సదస్సులో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ సభ్యులు లక్ష్మణరావు

వెలిగొండ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలి

● వెలిగొండ జలాల సాధన సదస్సులో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి - కనిగిరి

మూడు దశాబ్దాలుగా నిధుల లేమితో నత్తనడక నడుస్తున్న వెలిగొండ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని శాసన మండలి మాజీ సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణంలో శనివారం వెలిగొండ సాధన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు కేవలం రూ.400 కోట్లు మాత్రమే కేటాయించినట్లు తెలిపారు. రూ.నాలుగు వేల కోట్లు అవసరమైన ప్రాజెక్టును రూ. 400 కోట్లతో ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు.

వెంటనే రూ. నాలుగు వేల కోట్లు విడుదల చేసి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా వెలిగొండ ప్రాజెక్ట్ సాధన కోసం ఐక్య కార్యాచరణను రూపొందించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్ట్ ఆలోచన 1996లో వచ్చినట్లు తెలిపారు. 2004లో పాలనా పరమైన అనుమతితో రూ.960 కోట్ల అంచనాతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. అంచనా వ్యయం నేటికి రూ.10 వేల కోట్లకు పెరిగిందన్నారు. ఇప్పటి వరకు రూ.ఆరు వేల కోట్లు వ్యయం చేశారని, మరో రూ.నాలుగు వేల కోట్లు కేటాయిస్తేనే ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తవుతుందన్నారు. పిసిపల్లి మండలంలోని వెలిగొండ ప్రాజెక్ట్ పరిధిలోకి తీసుకురావాలని, పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని భూ నిర్వాసితులకు నష్టపరిహారాన్ని నిర్ణయించి అమలు చేయాలనే తీర్మానాలను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో నీటిపారుదల ప్రాజెక్టు నిపుణులు రాచర్ల శివ, మానవత అధ్యక్షులు ముక్కు బాలకష్టారెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తవ్వా సురేష్, కనిగిరి జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వి మాల కొండారెడ్డి, యుటిఎఫ్ నేత మీగడ వెంకటేశ్వర రెడ్డి, వరికపుడిసెల ఉద్యమ నేత పల్నాడు శ్రీను, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి ధనుంజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే కుట్రలు : ఆదినారాయణరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నేతలు కుట్రలు చేస్తున్నారని, వాళ్ళెన్ని కుట్రలు చేసినా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోలేరని శాసనసభలో బిజెపి విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే అదినారాయణరెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై అనవసరంగా నోరు పారేసుకున్న నాయకులకు తప్పకుండా సమాధానం చెబుతానన్నారు. కడప జిల్లాలో వేల కోట్లతో జరుగుతున్న అభివృద్ధిని ఆపే దమ్ము వైసిపి అధ్యక్షులు జగన్‌కు ఉందా? అని ఆయన ప్రశ్నించారు. పులివెందుల స్థానిక సంస్థల ఎన్నికలను తానే పర్యవేక్షిస్తానన్నారు.

కళత్తూరు ప్రజలకు అండగా ఎస్ఎఫ్ఐ

● బురదను తొలగిస్తూ సహాయక చర్యలు

ప్రజాశక్తి - కెవిబిపురం

తిరుపతి జిల్లా కెవిబిపురం మండలం పాతపాలెం ఓలూరు రాయలచెరువుకు గండిపడి ముంపునకు గురైన కళత్తూరు ప్రజలకు ఎస్ఎఫ్ఐ అండగా నిలిచింది. ఇళ్లల్లో పేరుకుపోయిన బురదను తొలగిస్తూ, వస్తువులను బయటకు తీస్తూ సహాయం అందించింది. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకత్వం ఎస్‌వి యూనివర్సిటీ బృందంతో కలిసి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిరాశ, బాధలో ఉన్న ప్రజానీకానికి ధైర్యం చెబుతూ సహాయ చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అక్బర్, భగత్ రవి మాట్లాడుతూ.. ప్రజలు కోలుకునేంత వరకూ ప్రభుత్వం సహాయ చర్యలు చేపట్టాలని, వారికి కావాల్సిన నిత్యావసర సరుకులను అందజేయాలని కోరారు.

విద్యార్థుల సర్టిఫికెట్లు కొట్టుకుపోయాయని, తక్షణమే ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా సర్టిఫికెట్లు కొత్తవి ఇప్పించాలని, ఉచితంగా పుస్తకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పవిత్ర, మాతేశ్వరి, రెడ్డికుమార్, నరసన్న, అనసూయ, మంజుల, దీపిక, తిరుమలేష్, భాస్కర్, షేక్షావలి, శివ పాల్గొన్నారు.




బురదతో ఉన్న వస్తువులను ఇంటి నుంచి బయటకు తీస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కురుబల గుడికట్ల పూజారులకు గౌరవవేతనం

● ఆర్‌డిటి లైసెన్సు పునరుద్ధరణకు చర్యలు
● భక్త కనకదాస జయంతి సభలో మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - అనంతపురం

కురుబల గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందిస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో శనివారం జరిగిన భక్త కనకదాస 538వ జయంతి సభలో ఆయన మాట్లాడారు. ఒకే రోజు మూడు పండుగలను కురుబ సోదరులతో కలిసి జరుపుకోవడం తన అదృష్టమన్నారు. దశాబ్దాలుగా అనంతపురం జిల్లాలో ఆర్‌డిటి అనేక సేవలు అందిస్తోందని, ఆ సంస్థ లైసెన్సు పునరద్ధరణ ఆలస్యమైందని తాను బాధ్యత తీసుకుని కేంద్రంతో మాట్లాడి లైసెన్సును పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకున్నానని హామీ ఇచ్చారు.



కనకదాస విగ్రహావిష్కరణలో మంత్రి లోకేష్, తదితరులు

కల్యాణదుర్గం పట్టణం కుందుర్పి సర్కిల్ వద్ద నుంచి హిందూపురం రోడ్డు బైపాస్ సర్కిల్‌కు వేలాది మంది మహిళలు, స్థానిక ప్రజలతో కలిసి మంత్రి ర్యాలీ నిర్వహించారు. సర్కిల్ వద్ద స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటు చేసిన భక్త కనకదాస తొమ్మిది అడుగుల కాంస్య విగ్రహాన్ని లోకేష్ ఆవిష్కరించారు. బైపాస్ సర్కిల్‌కు శ్రీ భక్త కనకదాస సర్కిల్‌గా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, ఎస్ సవిత, ఎంపిలు బికె పార్థసారథి, అంబికా లక్ష్మీ నారాయణ, అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షులు వెంకట శివుడు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, కందికుంట వెంకట ప్రసాద్, గుమ్మనూరు జయరాం, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్ర, డైరెక్టర్ దేవేంద్రప్ప, కడప రీజినల్ ఎపిఎస్ఆర్‌టిసి చైర్మన్ పూల నాగరాజు, కలెక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాదర్బార్ : అనంతపురం జిల్లా రెండు రోజు పర్యటనలో నారా లోకేష్ కళ్యాణదుర్గం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద 71వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన వారి నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు.

పోలవరం పనులను పరిశీలించిన అథారిటీ బృందం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టును పోలవరం అథారిటీ బృందం శనివారం పరిశీలించింది. ప్రాజెక్ట సిఇఒ అతుల్‌జైన్ నేతృత్వంలో ప్రాజెక్టులోని ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్‌లో గ్యాప్ 1, గ్యాప్ 2 ప్రాంతాల్లో 800 ఛానల్ వద్ద డివాల్ కటింగ్ పనులను, డయాఫ్రంవాల్ నిర్మాణ తీరును పరిశీలించి పనుల పురోగతిని అధికారులను బృందం ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్ట కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెలలో సిఇఒ అతుల్ జైన్ ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో ఇంజనీరింగ్ చీఫ్ కె నరసింహమూర్తి, జలవనరులశాఖ అధికారులు ఆయనను శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురామ్, ఎస్ఇ రామచంద్రరావు, పవర్ హౌస్ సిఇ సి వెంకటసుబ్బయ్య, డిప్యూటి డైరెక్టర్లు కె శంకర్, డిఎస్ ప్రసాద్, ఎ ప్రవీణ్, క్వాలిటీ కంట్రోల్ సిఇ కె శేషుబాబు, ఇఇలు డి శ్రీనివాస్, కె బాలకృష్ణ, ఎస్ ప్రేమచంద్, సిహెచ్ నరసింహరాజు, మెగా ఆపరేటింగ్ ఆఫీసర్ అంగర సతీష్‌బాబు, జనరల్ మేనేజర్ ఎ గంగాధర్, డిప్యూటీ మేనేజర్ పమ్మి మురళి తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టుని పరిశీలిస్తున్న ప్రాజెక్టు అథారిట బృందం

సంపాదకీయం

జీవన మంత్రం!

'**భూ**మి మనకు వారసత్వంగా రాలేదు. మన పిల్లల నుంచి అప్పుగా తీసుకున్నదే' అంటారు ఇండో అమెరికన్ వినోనా లాడ్యూక్. ఈ మాటలలోని లోతు మనం గ్రహించాల్సిన అవసరం ఎంతైనా వుంది. పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే, మన భవిష్యత్‌ను నిర్వీర్యం చేయడమే. మనిషి శ్వాసకు గాలి, జీవనానికి నీరు, భోజనానికి భూమి– ఇవన్నీ ప్రకృతి నుంచి లభించినవే. కానీ, అభివృద్ధి పేరుతో వాటిని నాశనం చేస్తూ, మనల్ని మనమే ప్రమాదంలోకి నెట్టుకుంటున్నాం. అడవుల నరికివేత, నదుల కాలుష్యం, గాలి మలినం, ప్లాస్టిక్ వ్యర్థాలు... ఇవన్నీ మానవ భవిష్యత్‌ను మింగేస్తున్న మృగాలు. గత కొన్ని దశాబ్దాలుగా అకాలంగా వస్తున్న వరదలు, ఎండలు, తుపానులు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులన్నీ పర్యావరణ అసమతుల్యతకు సంకేతాలు. మనం వేసిన ప్రతి చెట్టు, మనం కాపాడిన ప్రతి నది, మనం తగ్గించిన ప్రతి కార్బన్ ఉద్గారం... మన భవిష్యత్తుకు పెట్టుబడులు. 'మనకు ఒకే భూమి ఉంది. దానిని కాపాడుకోవడం మన బాధ్యత' అంటారు లియోనార్డో డికాప్రియో. చెట్టు నరికితే నీడ మాత్రమే కాదు, జీవం కూడా నశిస్తుంది. నదులు కాలుష్యమైతే నీరు మాత్రమే కాదు, ప్రాణికోటి ప్రమాదంలోకి నెట్టబడుతుంది.

'ప్రపంచం అగ్నిలో అంతమవుతుందంటారు కొందరు/ మంచులోనే చల్లగా చరమగీతం పాడుతుందంటారు మరికొందరు' అన్నది అమెరికన్ కవి రాబర్ట్ ఫ్రాస్ట్ రాసిన 'ఫైర్ అండ్ ఐస్' కవితలోని మొదటి పంక్తి. ఇది కవిత కాదు, ఓ హెచ్చరిక. ఈ రెండూ మానవ తప్పిదాలే. అతి కాలుష్యం, అతి ఉష్ణోగ్రతలు, అతి శీతలీకరణ, మంచు కరిగిపోవడం ప్రకృతి వినాశకాలు.

ప్రపంచ పర్యావరణ మార్పులు, ఉష్ణోగ్రతలు, వాటి భయంకర ప్రభావాలపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్... ఇటీవల జరిగిన కాప్–30 అంతర్జాతీయ సదస్సులో తీవ్ర హెచ్చరికలు చేశారు. 'వాతావరణ వినాశనం జరుగుతుండగా, కొన్ని కార్పొరేట్ సంస్థలు రికార్డు లాభాలు ఆర్జిస్తున్నాయి. ప్రజలను మోసం చేస్తూ పురోగతిని అడ్డుకుంటున్నాయి' అని పేర్కొన్నారు. ఈ హెచ్చరికలు ప్రపంచ నాయకుల కంటే ముందు, ప్రతి సామాన్యుడి చెవుల్లో మారుమ్రోగాలి. 2030 నాటికి ప్రపంచం 1.5 డిగ్రీల సెల్సియస్ పరిమితిని దాటబోతోంది. ఈ గీత దాటిన తర్వాత భూమి తిరిగి కోలుకునే అవకాశం చాలా తక్కువని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వాతావరణ చర్చలు ప్రారంభమై మూడు దశాబ్దాలు దాటింది. అయినా, అనుకున్న మేర ఉద్గారాలను నిరోధించలేకపోయాం. ఈ ఏడాది రికార్డు స్థాయిలో అత్యంత వేడి వుంటుందని ప్రపంచ వాతావరణ సంస్థ ఇప్పటికే వెల్లడించింది. మంచుకొండల కరుగుదల, భీకర తుఫానులు, ప్రాణాంతక వేడి గాలులు, తీరప్రాంతాల మునక... ఇవన్నీ దూరంలో వున్న ప్రమాదాలు కాదు. ఇప్పటికే మన తలుపు తడుతున్న వాస్తవాలు. మానవ మనుగడ కోసం సహజసిద్ధంగా ఏర్పడిన ప్రకృతి ప్రసాదితాలు... మానవ దుష్కృత్యాల వల్ల పర్యావరణం విధ్వంసకరంగా మారితే, అది మానవజాతి మనుగడకే ప్రమాదం.

గాలి, నీరు, నేల, ఆహారం– ఇలా అన్నిటిలోనూ హానికరమైన రసాయనిక పదార్థాలు, ఇతర భౌతిక, జీవ సంబంధిత హాని కారకాలు చేరడం వలన అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించకపోతే, అనేక రోగాలతో మానవాళి అంతరించే ప్రమాదముందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డబ్ల్యుహెచ్‌ఓ అంచనాల ప్రకారం... ప్రపంచవ్యాప్తంగా 320 కోట్ల మంది ప్రజలు పర్యావరణ సమస్యల వల్ల ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రపంచ జనాభాలో 23శాతం మంది ప్రజలు పర్యావరణ సంబంధిత కారణాలతో చనిపోతున్నారు. గాలి, నీరు, పరిసరాలు కాలుష్యరహితంగా వున్నప్పుడే ఆరోగ్యం కూడా సక్రమంగా వుంటుంది. 'పర్యావరణ పరిరక్షణ అంటే, ప్రకృతిని ప్రేమించడం కాదు. మనల్ని మనం ప్రేమించుకోవడం' అంటారు నోబెల్ శాంతి బహుమతి గ్రహీత వంగారి మాతాయ్. అడవుల గుండె చప్పుడు భూమికి శ్వాసనిస్తుంది. చెట్లు పెరిగిన చోటే జీవం పెరుగుతుంది. 'మన శరీరంలో ఊపిరితిత్తులు చేసే పనిని, పర్యావరణానికి అడవులు చేస్తాయి' అంటారో పర్యావరణవేత్త. ప్రకృతిని మనం కాపాడితే, అది మనల్ని కాపాడుతుంది. ఇది మానవ మనుగడకు జీవన మంత్రంగా మారాలి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే భవిష్యత్తరాలకు మనం మిగిల్చేది శూన్యం.

మహనీయుల మాట



కార్మిక వర్గానికి కావలసింది అందరికీ అందుబాటులో వుండే విద్యా విధానం. ఆ విద్యా విధానంలో పిల్లలు అభివృద్ధి చెందాలి. మానసికంగా ఎదగాలి. వారి వ్యక్తిత్వం అభివృద్ధి చెందేందుకు అవసరమైన లక్షణాలు ఆ విద్యా విధానంలో వుండాలి.

– ఆంటోనియో గ్రాంసీ,
ఇటాలియన్ మార్క్సిస్టు తత్వవేత్త.

ప్రత్యామ్నాయ శక్తులకు నూతనోత్సాహం

ప్రస్తుతం




తెలకపల్లి రవి

చరిత్ర వెనక్కు నడుస్తుందనీ/ధరిత్రి బల్లపరుపుగా వుందని/నరుడు మళ్లీ వానరుడవుతాడనీ/నమ్మని ఆశావాదులం మేం/ మా ఆశయం ఎప్పటికీ అజేయమే!

దాదాపు 35 ఏళ్ల కిందట సోవియట్ పరిణామాల నేపథ్యంలో నేను రాసిన కవితలో మొదటి వాక్యాలివి. ఇందులో మొదటి చరణం చరిత్రనూ రెండో చరణం శాస్త్ర విజ్ఞానాన్ని, మూడో చరణం పరిణామ క్రమాన్ని, నాలుగో చరణం సైద్ధాంతిక విశ్వాసాన్ని ప్రకటించాయి. వీటన్నిటితో కూడిన ఆశయం అజేయం అన్నది ఆఖరి వాక్యం. సమాజ గమనంలో ఆ శాస్త్రీయ సిద్ధాంత ప్రస్థానం ఎంత నిజమో ఈ వారం చాలా పరిణామాలు తెలియజెప్పాయి. మరెవరో ఎందుకు?–న్యూయార్క్ మేయర్‌గా జోహ్రానీ మమ్దానీ అఖండ విజయం సాధించాక 'న్యూయార్క్ క్యూబా అయిపోయిందని' ప్రపంచ డాన్–డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. న్యూయార్క్ వాసులందరూ ఫ్లోరిడా పారిపోవాలని పలాయన మంత్రం కూడా పఠించారు ఆయన. ఇప్పటిదాకా ప్రపంచాన్ని బెదిరిస్తూ వస్తున్న ట్రంప్ మమ్దానీ తొలి ప్రసంగం కోపోద్రేకంతో వుందని వాపోయారు. 'తను నా పట్ల మరింత నాజూగ్గా (నైస్‌గా) వుండాల్సిందని' వేడుకున్నారు. అతి దగ్గరలో వున్న సోషలిస్టు క్యూబాను అణగదొక్కాలని ఆంక్షలతో ఇప్పటికీ వేధిస్తున్న అమెరికా అధ్యక్షులవారు దేశంలోనే ప్రధాన నగరమైన న్యూయార్క్ క్యూబాగా మారిపోయిందని గగ్గోలు పెట్టడం చిత్ర విచిత్రమే. దాదాపు 88 లక్షలు పైబడిన జనాభాతో అమెరికాలో అతి పెద్ద నగరంగా వున్న బిగ్ యాపిల్ న్యూయార్క్‌ను ప్రపంచ వాణిజ్య ఆర్థిక సాంస్కృతిక మీడియా రాజధానిగా చెబుతుంటారు. అలాంటి మహా కీలక నగరం ఇప్పుడు ఒక సోషలిస్టు డెమోక్రాట్ జోహ్రాన్ మమ్దానీ పాలనలోకి రావడం అంతర్జాతీయంగానే సంచలనం సృష్టిస్తోంది. ప్రపంచం సోవియట్ అక్టోబర్ విప్లవం 110వ వార్షికోత్సవం జరుపుకొంటున్న రోజునే అమెరికా గుండెకాయ వంటి న్యూయార్క్ సోషలిస్టు మేయర్‌ను ఎన్నుకోవడం కుంభస్థలం కొట్టడం వంటిదే. వాస్తవాలు కల్పన కన్నా చిత్రంగా వుంటాయంటారందుకే.

ధనరాశులే గుమ్మరించినా...

జోహ్రాన్ మమ్దానీ డెమోక్రటిక్ పార్టీ ప్రైమరీలను దాటుకుని మేయర్ అభ్యర్థిగా వచ్చిన నాటి నుంచి అమెరికా ఆధిపత్య వర్గాలు హడలిపోతూనే వున్నాయి. రిపబ్లిక్ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ గవర్నర్ కుర్దిస్ సిల్వా ఆయనను ఎదుర్కొనడానికి పనికి రాడని స్వయంగా ట్రంప్ డెమోక్రటిక్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థి ఆంద్రూ కుమో ను బలపర్చాడు. 26 మంది సహస్ర కోటీశ్వరులు, ఆధిపత్య కుటుంబాలు మమ్దానీ అభ్యర్థి కాకుండా చూసేందుకు, ఆయ్యాక ఓడించేందుకు 2.20 కోట్ల డాలర్లకు పైగా ఖర్చు చేశాయని ఫోర్బ్స్ పత్రిక వెల్లడించింది. బ్లూంబర్గ్ అధినేత మైకేల్ బ్లూంబర్గ్ ఒక్కడే కుమో అభ్యర్థిత్వం కోసం 80 లక్షల డాలర్లను ఖర్చు చేశాడు. అయితేనేం, ఇవన్నీ విఫలం కాక తప్పలేదు. ఇంత పెద్ద ధనాఢ్య శక్తులు, మీడియా మొఘల్స్‌తో పోలిస్తే జోహ్రాన్ మమ్దానీ కేవలం పేద మధ్యతరగతి వర్గాలు, శ్రామిక ప్రజల అండదండలతోనే ఇంతటి విజయం సాధించడం ఒక రికార్డే. పైగా తను భారతీయ (గుజరాతీ) మూలాలతో ఉగాండాలో పుట్టిన ఒక ముస్లిం. ఓ దక్షిణాసియా ముస్లిం న్యూయార్క్ మేయర్ కావడమే సంచలనమైతే రాజకీయంగా సోషలిస్టు భావాలు గల వ్యక్తి. వయసును బట్టి చూస్తే 34 ఏళ్ల అతి చిన్న మేయర్. ఆయన తల్లి మీరా నాయర్ కూడా ప్రత్యామ్నాయ భావజాలానికి, ఫెమినిస్టు చిత్రాలకు ప్రపంచ పురస్కారాలు పొందిన ప్రతిభావంతురాలు. ఈ నేపథ్యంతోనే జోహ్రాన్ కార్పొరేట్ ప్రపంచీకరణ, ప్రైవేటీకరణల తాకిడికి తల్లడిల్లుతూ ట్రంప్ విచ్చలవిడి బాదుగలతో బాధలపాలైన సగటు మనుషుల కోసం ప్రజానుకూల ప్రణాళిక ప్రకటించగలిగారు. గాజాలో ఇజ్రాయిల్ సాగించే మారణకాండను ఖండించడమేగాక భారత దేశంలో మోడీ పాలనలో లౌకికతత్వంపై సాగుతున్న దాడులతో విడగొట్టుకున్న లౌకిక వాది. విజయం తర్వాత తొలి ప్రసంగంలో జవహర్‌లాల్ నెహ్రూను ప్రస్తావించడం ద్వారా నేరుగా సంఘ పరివార్ మతతత్వ రాజకీయాలను తోసిపుచ్చిన ధీశాలి. అణచివేతకు గురైన ప్రజానీకం నిలదొక్కుకునే రోజు వస్తుందంటూ నెహ్రూ స్వాతంత్ర్య దినాన చేసిన ప్రసంగం వాస్తవానికి జోహ్రాన్‌కు గొప్పగా గెలిపించిన పేద వర్గాలన్నిటికీ వర్తిస్తుంది.



దాదాపు 88 లక్షలు పైబడిన జనాభాతో అమెరికాలో అతి పెద్ద నగరంగా వున్న బిగ్ యాపిల్ న్యూయార్క్‌ను ప్రపంచ వాణిజ్య ఆర్థిక సాంస్కృతిక మీడియా రాజధానిగా చెబుతుంటారు. అలాంటి మహా కీలక నగరం ఇప్పుడు ఒక సోషలిస్టు డెమోక్రాట్ జోహ్రాన్ మమ్దానీ పాలనలోకి రావడం అంతర్జాతీయం గానే సంచలనం సృష్టిస్తోంది. ప్రపంచం సోవియట్ అక్టోబర్ విప్లవం 110వ వార్షికోత్సవం జరుపుకొంటున్న రోజునే అమెరికా గుండెకాయ వంటి న్యూయార్క్ సోషలిస్టు మేయర్‌ను ఎన్నుకోవడం కుంభస్థలం కొట్టడం వంటిదే. వాస్తవాలు కల్పన కన్నా చిత్రంగా వుంటాయంటారందుకే.

ప్రజానుకూల కార్యక్రమం

నిరుద్యోగం, పని గంటల పెంపు, అంతులేని పని ఒత్తిడి, తొలగింపుల కత్తితో అభద్రతలో ముంచిన ట్రంప్ పాలనకు సరైన ప్రత్యామ్నాయంగా ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలను చేపడతానని మమ్దానీ ఇచ్చిన హామీలు ప్రపంచమంతటా పరిశీలకులను ఆకర్షించాయి. ప్రపంచ దేశాలన్నిటి నుంచి వచ్చిన శ్రామికుల, వలస శ్రామికుల చెమటతో నిర్మితమైన న్యూయార్క్ (అన్ని నగరాల లాగే) మహా కుబేరుల స్వర్గధామంగా మారింది. దేశంలోనూ ప్రపంచంలోనూ కూడా జాతుల, దేశాల అణచివేతకు కేంద్ర బిందువుగా తయారైంది. ఈ మధ్య ట్రంప్ దుందుడుకు విధానాలతో వారి ఉనికికి కూడా ఉపద్రవం ఏర్పడింది. ఈ నిరంకుశత్వమే వారిని జోహ్రాన్‌ను బలపర్చేలా చేసింది. ఇజ్రాయిల్ జాత్యహంకార నరమేధాన్ని గట్టిగా ఖండించిన ఆయన బాలీవుడ్ పాటలు, డైలాగులతో ఆకర్షణీయమైన ప్రచార పద్ధతి పాటించడం కూడా ఏషియన్లను ఆకట్టుకుంది. అంతులేని అగాథం లాంటి ఆదాయ వ్యత్యాసాలు పెరిగిన అమెరికాలో సంపద పున:పంపిణీ జరగాలని ఆయన నినాదం తీసుకున్నాడు. అందుబాటు కల్పించడం (అఫర్డబిలిటీ) అన్న ఆయన నినాదం ట్రంప్ దాడిని ఓడించే విరుగుడుగా కనిపించింది. భయంకరంగా పెరిగిపోయిన ఇళ్ల అద్దెల కారణంగా స్వంత ఇళ్లు కట్టుకోలేని లక్షలాది కుటుంబాలకు జోహ్రాన్ ప్రతిపాదించిన అద్దె నియంత్రణ, స్తంభన ఆలోచన గొప్పగా నచ్చేసింది. నగరంలో కనీసం పది లక్షల కుటుంబాలకు ఇది ఉపయోగకరమని భావిస్తున్నారు. అమెరికాలో అందరికీ కార్లు వుంటాయనే అంచనాలు ఎలా వున్నా ఉచిత రవాణా కల్పిస్తానని చెప్పడం మరింత నచ్చింది. ఇప్పటికే స్కాండినేవియన్ దేశాలలో ఈ సదుపాయం వుంది. బ్రెజిల్ లోని 116 నగరాలలో పౌరుల ప్రయాణం పూర్తిగా ఉచితం. టర్కీ రాజధాని ఇస్తాంబుల్ లోనూ, ఆస్ట్రేలియాలో, అమెరికాలో కొన్ని నగరాలలో ఈ అవకాశం వుంది. మహిళలు, విద్యార్థులు, యువతకు ఉచిత రవాణా ఉత్పత్తిని ఉపాధిని పెంచుతుందని రుజువైంది. కర్ణాటక, ఢిల్లీ, తెలంగాణ, ఎ.పి తో సహా మన దేశంలోనూ వివిధ రకాలుగా ఈ అవకాశం కల్పిస్తున్నారు. జోహ్రాన్ దీన్ని న్యూయార్క్‌లోనూ ప్రవేశ పెట్టబోతున్నారు. వీటితో పాటే కీలకమైన మరో కొత్త ఆలోచన ప్రభుత్వ కిరాణా దుకాణాలు పెట్టడం, విపరీతంగా పెరిగిన ధరల కారణంగా అల్లాడిపోతున్న పేద దిగువ వర్గాలకు ముఖ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందుబాటులో తెచ్చేందుకు షాపులు ఏర్పాటు చేస్తారు. మొదటి విడతగా అయిదు చోట్ల ఇవి ఏర్పాటవుతాయి. ఇవన్నీ వింటుంటే మనం చూస్తున్న సంక్షేమ చర్యలు, ఉచితాల వంటి విచిత్ర వాదనలు గుర్తుకు రావచ్చు. వీటన్నిటికీ తార్కిక సమర్థనగా జోహ్రానీ సోషలిస్టు భావజాలం తీసుకొచ్చి కొందరే అన్నీ అనుభవించడం సరికాదని గట్టిగా ప్రచారం చేయడం ప్రజలకు నచ్చింది. గతంలోనూ అమెరికాలో బెర్నీ శాండర్స్, బ్రిటన్‌లో జెరెమీ కార్బిన్ వంటి వారు తమదైన పద్ధతులలో సంక్షేమ విధానాలు ప్రతిపాదించారు. స్వతహాగా అమెరికాలో పుట్టలేదు గనక అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశం ఆయనకు వుండకపోయినా భవిష్యత్ పరిణామాలలో కీలక ప్రభావం వుంటుందనే అంచనా వేస్తున్నారు.

సానుకూల సంకేతాలు

వామపక్షాలకు, కమ్యూనిస్టులకు సంతోషం కలిగించే మరికొన్ని పరిణామాలు కూడా ఈ వారంలోనే సంభవించడం ఆసక్తికరం. వాటిలో చాలా కీలకమైంది నేపాల్‌లో కమ్యూనిస్టు పార్టీలు ఒక తాటి మీదకు రావడం. గతంలో వారు కలవడం కలసి అధికారం చేయడం విడిపోవడం, వంటివి చాలాసార్లు జరిగాయి. మూడు మాసాల కిందట అకస్మాత్తుగా మొదలైన జన్ జెడ్ నిరసన వెల్లువతో ప్రధాని రాజీనామా, పార్లమెంటు రద్దు కూడా తెలిసినవే. మార్చిలో ఎన్నికలకు నేపాల్ సిద్ధమవుతున్నది. ఈ సమయంలో తొమ్మిది వామపక్షాలు కలిసి ఒకటిగా ఏర్పడాలని నిర్ణయించాయి. మావోయిస్టు అనే మాట తొలగించాలని నిర్ణయిస్తూ మార్క్సిజం, లెనినిజం మార్గదర్శకంగా పని చేస్తామన్నారు. అక్కడ మరో పెద్ద పార్టీ యు.ఎం.ఎల్ మాత్రం కలవలేదు. మిగతా లోతుపాతులు ఎలా వున్నా వివిధ కమ్యూనిస్టు బృందాలు, పక్షాలు ఒక్క తాటిపైకి రావడం నేపాల్‌లో ప్రజాస్వామిక శక్తులకు ప్రయోజనం కలిగిస్తుందని మాత్రం అంచనా వేస్తున్నారు. గత ఏడాదే శ్రీలంక అధ్యక్షుడుగా అనుర కుమార దిసనాయకే ఎన్నిక కావడం గుర్తుండే వుంటుంది. దక్షిణ అమెరికాలోనూ పలు చోట్ల వామపక్ష నేతలు విజయం సాధించారు.

ఢిల్లీలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో అనేక పోరాటాలు, అణచివేతల తర్వాత వామపక్ష సంఘాలు ఎబివిపి ని చిత్తుగా ఓడించి విజయం సాధించడం కూడా ఈ పరంపరలోదే. కాగా కేరళలో రెండోసారి వరుసగా ఎన్నికై మూడో దఫాకు దూసుకుపోతున్న పినరయి విజయన్ ప్రభుత్వం అతి పేదరిక నిర్మూలన (ఇ.పి.ఇ.పి) అమలులో విజయం సాధించడం, అందుకు అనుసరించిన ప్రణాళికాబద్ధ విధానాల విజయం కూడా ఈ వరుసలో చెప్పుకోదగిందే. కేరళలో అక్షరాస్యత, ఆరోగ్య పరిరక్షణతో సహా మానవాభివృద్ధి సూచికల్లో సాధించిన అసాధారణ అభివృద్ధి కూడా ప్రత్యామ్నాయ విధానాల ఫలితమే. నిజానికి 2024 ఎన్నికల్లోనే మోడీ ప్రభుత్వం మెజార్టీ కోల్పోయింది. ఎన్నికల సంఘం అండతో గట్టెక్కుతుందనే విమర్శలు బాహాటంగానే ఎదుర్కొంటోంది.


ఢిల్లీలోని ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో అనేక పోరాటాలు, అణచివేతల తర్వాత వామపక్ష సంఘాలు ఎబివిపి ని చిత్తుగా ఓడించి విజయం సాధించడం కూడా ఈ పరంపరలోదే. కాగా కేరళలో రెండోసారి వరుసగా ఎన్నికై మూడో దఫాకు దూసుకుపోతున్న పినరయి విజయన్ ప్రభుత్వం అతి పేదరిక నిర్మూలన (ఇ.పి.ఇ.పి) అమలులో విజయం సాధించడం, అందుకు అనుసరించిన ప్రణాళికాబద్ధ విధానాల విజయం కూడా ఈ వరుసలో చెప్పుకోదగిందే.

మరో ప్రపంచం మరవొద్దు...

జోహ్రాన్ మమ్దానీ విజయం యూరప్ లోనూ ప్రపంచమంతటా కూడా ప్రగతివాదులకు గొప్ప ఉత్సాహమిచ్చింది. రష్యా కమ్యూనిస్టు పార్టీ ఈ విజయాన్ని స్వాగతించింది. బ్రిటన్‌లో గ్రీన్ పార్టీ, జర్మనీలో సోషల్ డెమోక్రటిక్ పార్టీ హర్షం వెలిబుచ్చాయి. ఈ విజయాన్ని మార్క్సిజం గెలుపుగా అమెరికాలో ఫాక్స్ న్యూస్ వంటి కొన్ని మీడియాలు వర్ణించాయి. మరికొన్ని ట్రంప్‌కు చెంపదెబ్బగా పేర్కొన్నాయి. 80వ దశకంలో రోనాల్డ్ రీగన్, మార్గరెట్ థాచర్ వంటి వారు ప్రవేశ పెట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకతకు నూతన సహస్రాబ్దిలో ప్రపంచీకరణ తోడై మితవాద అభివృద్ధి నిరోధక శక్తులు చెలరేగిన మాట నిజం. అనేక నష్టాలు కూడా కలిగించిన మాట వాస్తవం. అయితే వాటికి ఇక తిరుగులేదనే వాదనకు మాత్రం వాస్తవ పరిణామాలు గండికొడుతున్నాయి. శ్రీశ్రీ చరణాలను అన్వయిస్తూ ఆరుద్ర రాసిన పున:ప్రస్థానం గుర్తుకు వస్తుంది.

ధనాఢ్యులంతా ధరాధిపతులై/జనాన్ని దోపిడి చేస్తుంటే/వర్గ కలహమే వద్దని చెప్పే/దుర్గతి టక్కున చాలించు...మనస్సు మారిన వయస్సు మళ్లిన/మహా నాయకులు మనకొద్దు/తాతల తండ్రుల ఆదర్శాలను/తాకట్టుకు గుట్టుగ పెట్టొద్దు/మరో ప్రపంచం మరో ప్రపంచం/ మరో ప్రపంచం మరవొద్దు! ★

'కాశీబుగ్గ' ఘటనకు బాధ్యులెవరు?



కె. లోకనాథం

దేవాలయ నిర్మాణం, భక్తుల భద్రత తదితర అంశాలపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భద్రతా ప్రమాణాల అంశం చర్చకు వచ్చింది. ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడిన విషయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మున్సిపల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడితే వెంటనే మున్సిపల్ అధికారులు ఆగమేఘాల మీద వచ్చి హెచ్చరికలు జారీ చేస్తారు. నోటీసులు ఇస్తారు. మరి అలాంటిది వేలాది మంది భక్తుల భద్రత విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు? ఉదయమే ఆ దేవాలయం దగ్గరకు వేలాది మంది భక్తులు చేరుకున్నట్లు మీడియా మిత్రులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. హడావుడిగా మున్సిపల్ కమిషనర్ వచ్చి పోలీసులకు సమాచారం తెలియజేసినట్లు అనేకమంది చెబుతున్నారు. సకాలంలో పోలీసు అధికారులు జోక్యం చేసుకొని వుంటే ఇలాంటి ఘటన జరిగేది కాదు. దీనికి ఎవర్ని శిక్షిస్తారు?



శనివారం ఏకాదశి రోజున శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆలయాల్లో భక్తుల భద్రత ఎంత లోపభూయిష్టంగా ఉందో తెలియజెప్పే ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మొన్న తిరుపతి, నిన్న సింహాచలం, నేడు కాశీబుగ్గ. ప్రాంతమేదైనా ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వల్ల భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇక తాజా ఘటన విషయానికొస్తే కొద్ది నెలల క్రితం పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఈ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రారంభమైంది. హరిముకుంద పాండా (95)కు చెందిన సుమారు 12 ఎకరాలలోని కొంత భాగంలో ఈ గుడి నిర్మాణం చేపట్టారు. ఇదొక ప్రైవేటు ఆలయం. ఇక్కడ నిత్యపూజలు జరుపుతున్నారు. రోజురోజుకూ దీని ప్రాముఖ్యత పెరిగింది. చిన్న తిరుపతిగా పేరుగాంచింది. సాధారణ రోజుల్లో ఇక్కడకు ప్రతి రోజూ 2 వేల నుండి 4 వేల మంది వరకు భక్తులు వచ్చేవారు. ఏకాదశి కావడంతో శనివారం దాదాపు 25 వేల మంది భక్తులు ఇక్కడకు వచ్చారు. దైవ దర్శనాలకు వెళ్ళేవారికి, తిరిగి వస్తున్న వారికి ఒకే గేటు అవ్వడంతో తొక్కిసలాటకు దారితీసింది. మొదటి అంతస్తులోకి వెళ్తుండగా మెట్లకు ఆనుకొని వున్న రైలింగ్ విరిగిపోవడంతో పైనున్న భక్తులు కింద వున్న వారిపై పడ్డారు. దీనితో ఎనిమిది మంది మహిళలు, ఒక బాలుడు మొత్తం తొమ్మిది మంది చనిపోయారు. ముగ్గురు మహిళలు శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులైన మరో 16 మంది పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారు కోలుకోవడానికి సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఈ సంఘటన చాలా బాధాకరం. వాస్తవాలను పరిశీలించడానికి సిపిఎం ప్రతినిధుల బృందం పలాసలోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించింది. జరిగిన ఘటనపై బాధితులు అనేక అంశాలు ప్రతినిధి బృందానికి తెలియజేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు చేపట్టాల్సి వుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 18 నెలల్లో మూడు ఘటనలు జరిగాయి. అందులో మొదటిది తిరుపతి ఘటన. ఇక్కడ ఉచిత దర్శనాలు ప్రభుత్వమే నిర్వహిస్తున్నట్టు ప్రకటన చేయడంతో వేలాది మంది భక్తులు దర్శనానికి వచ్చారు. ఒక గ్రౌండ్లో భక్తులందరినీ చేర్చిన తర్వాత ఒకేసారి గేట్లు తెరవడంతో తోపులాట జరిగి ఆరుగురి నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అలాగే అనేక మంది క్షతగాత్రులు అయ్యారు. రెండో ఘటన సింహాచలం దేవస్థానంలో జరిగింది. అప్పన్న చందనోత్సవం రోజున క్యూలైన్లలో ఉన్న భక్తులపై అప్పుడే కట్టిన నాసిరకమైన గోడ కూలిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు చనిపోయారు. మరి కొంతమంది క్షతగాత్రులయ్యారు. ఈ రెండు ఘటనల నుండి రాష్ట్ర ప్రభుత్వం గుణపాఠాలు నేర్చుకోలేదు. దీనిని మరవకముందే నేడు కాశీబుగ్గలో వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రమాదంలో తొమ్మిది మంది చనిపోయారు.

ఈ దేవాలయ నిర్మాణం, భక్తుల భద్రత తదితర అంశాలపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భద్రతా ప్రమాణాల అంశం చర్చకు వచ్చింది. ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడిన విషయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. మున్సిపల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడితే వెంటనే మున్సిపల్ అధికారులు ఆగమేఘాల మీద వచ్చి హెచ్చరికలు జారీ చేస్తారు. నోటీసులు ఇస్తారు. మరి అలాంటిది వేలాది మంది భక్తుల భద్రత విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించారు? ఉదయమే ఆ దేవాలయం దగ్గరకు వేలాది మంది భక్తులు చేరుకున్నట్లు మీడియా మిత్రులు ఉన్నతాధికారులకు తెలియజేశారు. హడావుడిగా మున్సిపల్ కమిషనర్ వచ్చి పోలీసులకు సమాచారం తెలియజేసినట్లు అనేకమంది చెబుతున్నారు. సకాలంలో పోలీస్ అధికారులు జోక్యం చేసుకొని వుంటే ఇలాంటి సంఘటన జరిగేది కాదు. దీనికి ఎవర్ని శిక్షిస్తారు? సమస్యలపై ప్రజలు కదులుతుంటే పోలీసులు అనేక ఆంక్షలు విధిస్తారు. ఇటీవల పలాసలో ఏ చిన్న అంతర్గత సమావేశం జరిగినా పోలీసులు అంగీకరించడంలేదు. పర్మిషన్ లేకుండా ఎక్కడా సమావేశాలు జరగకూడదని హుకుం జారీ చేశారు. ఇది పలాస పోలీసుల ప్రత్యేకత. ఫ్రెండ్లీ పోలీసుల నుండి కక్షపూరిత పోలీసులుగా మారిపోతున్నారు. ప్రజల సేవకన్నా అధికార పార్టీ సేవలో మునిగితేలుతున్నారు. పోలీసు వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకోవలసి వుంది. ఇటువంటి పరిస్థితుల్లో ఇంత మంది భక్తులు వస్తున్నప్పుడు ఎందుకు ముందస్తు భద్రత ఏర్పాటు చేయలేదు? ఈ ఆలయ కార్యక్రమాలు ఎప్పటి నుండో నిర్వహిస్తుంటే జరిగే పరిణామాలు ఎందుకు అంచనా వేయలేకపోయారు? దేవాలయం విస్తరణ జరిగి భక్తుల రద్దీ పెరుగుతుంటే రాబోయే పరిణామాలను ఎందుకు అంచనా కట్టలేకపోయారు? ఈ విషయాలన్నింటినీ పరిశీలిస్తే నిఘా వ్యవస్థ యొక్క వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

ఒకవైపు ప్రభుత్వ ఆధీనంలో దేవాలయాలు నడుస్తున్నాయి. దేవాదాయ, ధర్మాదాయ శాఖలు వీటిని పర్యవేక్షిస్తున్నాయి. కొన్ని ఆలయాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారు. ప్రైవేట్ యాజమాన్యంలో నడుస్తున్న దేవాలయాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎందుకింత ఉదాసీనతను ప్రదర్శిస్తోంది? ఆర్.ఎస్.ఎస్ మరోవైపున దేవాలయాలను ప్రైవేటు ధర్మకర్తలకు అప్పగిస్తే ఇంకా నాణ్యతగా నడుస్తాయన్న వాదనను ఎప్పటికప్పుడు వినిపిస్తోంది. నేడు ఒక ప్రైవేటు వ్యక్తి దేవాలయ నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలనే ఇంతమంది అర్థాంతరంగా చనిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో కూడా గోదావరి పుష్కరాల్లో 27 మంది మరణించారు.

కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్.డి.ఎం.ఎ) 2006 నిబంధనల ప్రకారం దేవాలయాలు, మేళాలు, మహా కుంభమేళాలు, రైల్వేస్టేషన్లు, స్టేడియంలు మొదలైన జన సమూహాల దగ్గర మార్గదర్శక సూత్రాలను నిర్దేశించింది. అందులో భాగంగా జన సమూహాలు చేరుతున్న ప్రాంతంలో ముందస్తుగా ప్రణాళికలు వుండాలి. ఆలయానికి వెళ్ళే ద్వారం, బయటకి వచ్చే ద్వారం వేరు వేరుగా వుండాలి. ఎమర్జన్సీ గేట్లు 24/7 గంటలూ తెరిచివుండాలి. సి.సి కెమేరాలు పెట్టాలి. దీనితో పాటు ప్రతి 100 మీటర్లకు నాలుగు కెమేరాలు వుండాలి. మెడికల్ ఎమర్జన్సీ ప్రతి 500 మందికి ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఒక వాలంటీరు, రెండు కిలోమీటర్ల లోపల రెండు అంబులెన్సులు, మొబైల్ ఐ.సి.యు వుండాలి. వాహనాలకు మూడు కిలోమీటర్ల దూరంలో పార్కింగ్ వుండాలి. లౌడ్ స్పీకర్లు ప్రతి 50 మీటర్లకు వుండాలి. వర్షం పడితే ప్రత్యేక ఏర్పాట్లు వుండాలని నిర్దేశించింది. దీనికి భిన్నంగా ప్రజా సమీకరణ జరిగే ప్రాంతాల్లో ఈ నిబంధనలు ఏవీ అమలు చేయడంలేదు. దీనితో ఘటనలు జరిగినప్పుడు స్పందించడం తప్ప భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయడంలేదు. ప్రభుత్వ యంత్రాంగమే ఆ దిశగా కృషి చేయడంలేదు. ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ దేవాలయాలు, మసీదులు, చర్చిలపై సమగ్ర సర్వే చేసి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడిచేలా చర్యలు తీసుకోవాలి.

/వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

లౌకిక సంస్కృతికి విఘాతం కలిగించొద్దు

- డిడిఎ జోక్యాన్ని ఖండించిన సహమత్

న్యూఢిల్లీ : లౌకిక సంస్కృతికి విఘాతం కలిగించేలా ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ (డిడిఎ) జోక్యం చేసుకోవడాన్ని సఫ్దర్ హష్మీ మెమోరియల్ ట్రస్ట్ (సహమత్) తీవ్రంగా ఖండించింది. ఆమె కా బాగ్‌లో 'ఫూల్ వాలోం కీ సైర్' అనే వార్షిక మేళాను నిర్వహించకుండా అడ్డుకున్న డిడిఎ చర్యను వ్యతిరేకించాలని, ఖండించాలని ప్రజలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశ ప్రజల ఐక్యతను ప్రస్ఫుటిస్తూ ఈ వేడుకను నిర్వహించుకుంటారని గుర్తుచేసింది. ఢిల్లీ ప్రజలు ఏమి చేయాలో నిర్ణయించే సంస్థగా డిడిఎ తనను తాను ఊహించుకుంటోందని, తనకు సంబంధం లేని విషయాల్లో జోక్యం చేసుకుంటుందని సహమత్ విమర్శించింది. ఒక ప్రసిద్ధ వేడుక నిర్వహణలో జోక్యం చేసుకోవడంతో పాటు ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించడానికి డిడిఎ ప్రకటనలు చేయడాన్ని సహమత్ ఖండించింది. పురాతనమైన, ఉమ్మడి సంస్కృతి వేడుకల్లో ఒకటైన ఈ ఉత్సవాన్ని భంగపరిచే ఏ చర్యనూ అనుమతించబోమని, ఢిల్లీ ప్రజలకు మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేసింది. శతాబ్దానికి పైగా కొనసాగుతున్న లౌకిక, సమ్మిళిత, ఉమ్మడి పద్ధతుల్లో జోక్యం చేసుకోకూడదని విజ్ఞప్తి చేసింది.

సామినేనిది ముమ్మాటికీ రాజకీయ హత్యే

- బిజెపి చిచ్చు నుంచి కాపాడే కమ్యూనిస్టులపై కాంగ్రెస్ దాడులు
- ఆయన మరణం ఉత్తిగా పోదు.. సరైన న్యాయం చేస్తాం
- బివి రాఘవులు, తమ్మినేని, జాన్‌వెస్లీ



సామినేని సంస్మరణ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామినేని రామారావు హత్యకు సునిర్దిష్టంగా పథకం రచించిన తీరు, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను బట్టి తెలుస్తోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. హత్య జరిగి తొమ్మిది రోజులైనా దోషులను తేల్చకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యకు కారకులు తేలేదాకా ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడులో శనివారం ఏర్పాటు చేసిన సామినేని రామారావు సంస్మరణ సభకు బివి రాఘవులు కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో కలిసి హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు గ్రామంలో పెద్దఎత్తున నిర్వహించిన ర్యాలీలో రాఘవులు పాల్గొన్నారు. హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంస్మరణ సభకు జనం భారీగా హాజరయ్యారు.

రాజకీయ దురుద్దేశంతోనే హత్య

శత్రువులతోనూ చాలా సౌమ్యంగా వ్యవహరించే వ్యక్తిత్వం సామినేని రామారావుది అని రాఘవులు అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే హత్య చేశారని ఆరోపించారు. రాష్ట్ర హోంమంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రిగా మధిర నియోజకవర్గానికి చెందిన భట్టి విక్రమార్క, రాష్ట్రంలో కీలక బాధ్యతల్లో జిల్లా మంత్రులున్నా హత్య జరిగి తొమ్మిది రోజులైనా నిందితులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. దొంగలు, దోపిడీదారులను గంటల్లోనే పట్టుకున్నామని ప్రకటనలు చేసే పోలీసులు ఏం చేస్తున్నారని అన్నారు. హత్య జరిగిన వెంటనే ఖండించిన భట్టి విక్రమార్క ఇప్పటి వరకు దోషులను ఎందుకు తేల్చలేదని ప్రశ్నించారు. ప్రజలను దోచుకునేది కాంగ్రెసైతే.. ప్రజలను కాపాడేది కమ్యూనిస్టులన్నారు. కమ్యూనిస్టులకు ప్రాణత్యాగాలు కొత్త కాదన్నారు. సామినేని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

దోపిడీకి వ్యతిరేకంగా నిలబడ్డారు.. : జాన్‌వెస్లీ

దోపిడీ, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా నిలబడ్డారు కాబట్టే సామినేని రామారావును హత్య చేశారని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆర్థిక ప్రయోజనాల రీత్యా హత్య జరిగితే కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా పంచాయితీ చేసిందా? అని ప్రశ్నించారు.

పాసిస్టు విధానాలను ధిక్కరించేదే కమ్యూనిజం: వై.వెంకటేశ్వరరావు

హంతకులను తేల్చి కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ ప్రమేయం లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత భట్టివిక్రమార్కపై ఉందని సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. పాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు నిలబడుతున్నారని చెప్పారు. ఈ క్రమంలో వందలాది మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగాన్ని చేసిన చరిత్ర ఉందన్నారు.

అన్యాయాన్ని ఎదురించడంలోనే కమ్యూనిస్టుల వైభవం :తమ్మినేని వీరభద్రం

కమ్యూనిస్టుల వైభవం సీట్లు, ఓట్లలో లేదని అన్యాయాన్ని ఎదురించడంలో ఉందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. ప్రజలే పరమావధిగా భావించి నిష్కళంక ఉద్యమాలు చేసిన నాయకుడు సామినేని రామారావు అన్నారు.

దగ్గు, జలుబుతో ట్రిపుల్ ఐటి విద్యార్థులు సతమతం

- ప్రతిరోజూ వంద మంది విద్యార్థులకు చికిత్స

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ట్రిపుల్ ఐటి విద్యార్థులు తీవ్రమైన దగ్గు, జలుబుతో సతమతమవుతున్నారు. ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిరోజూ సుమారు వంద మందికిపైగా అనారోగ్యంతో కళాశాల ఆవరణలోని వైద్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

నాలుగైదు రోజులుగా కళాశాలలో ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా విద్యార్థులు అస్వస్థతకు గురికాకుండా యాజమాన్యం ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. అవసరమైతే ప్రత్యేక వైద్య శిబిరం రెండు రోజులపాటు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చిత్తు కాగితాలపై మధ్యాహ్న భోజనం

మధ్యప్రదేశ్‌లో దారుణం



పిల్లలకు పేపర్లపై మధ్యాహ్న భోజనం వడ్డించిన దృశ్యం

భోపాల్ : బిజెపి పాలిత మధ్యప్రదేశ్‌లోని ఒక పాఠశాలలో విద్యార్థులకు చిత్తుకాగితాలపై మధ్యాహ్న భోజనం వడ్డించిన దారుణ ఘటన చోటుచేసుకుంది. ఈ నెల 3న షియోపూర్ జిల్లా విజయ్‌పూర్ బ్లాక్ పరిధిలోని హుల్పూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నేలపై కూర్చున్న విద్యార్థులకు చిత్తు కాగితాల ముక్కలపై ఆహారాన్ని వడ్డిస్తున్న వీడియో సోషల్ మీడియాలో తాజాగా వైరల్‌గా మారింది. దీంతో పాఠశాల ఇన్‌ఛార్జ్ భోగిరామ్ ధకాడ్‌ను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. పాఠశాలకు ఆహారం అందించే స్వయం సహాయక బృందంతో ఒప్పందాన్ని రద్దు చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రధాన మంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్ (పిఎం పోషణ్) పథకం కింద అమలు చేస్తున్నారు. ఈ ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఇతర బిజెపి నాయకులు గానీ స్పందించలేదు.

పిల్లల పేట్లను కూడా మధ్యప్రదేశ్ ప్రభుత్వం దొంగిలించింది : రాహుల్‌గాంధీ

20 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్ ప్రభుత్వం, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పిల్లల ప్లేట్లను కూడా దొంగిలించాయని, అభివృద్ధి కేవలం భ్రమ అని కాంగ్రెస్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఇలాంటి దయనీయ స్థితిలోకి చిన్నారులను, వారి భవిష్యత్‌ను దిగజార్చినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ 'సిగ్గుపడాలి' అని అన్నారు. దేశ భవిష్యత్తును కలలు కంటున్న అమాయక చిన్నారులని, వీరికి కనీస గౌరవం కూడా దక్కడం లేదని పేర్కొంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాల్సిందే

- వారి నివాసాల మీదుగా రథయాత్ర నిర్వహించండి
- ముత్తు కొలక్కి అమ్మన్ ఆలయ నిర్వాహకులకు మద్రాస్ హైకోర్టు ఆదేశం



చెన్నై : కాంచీపురం జిల్లా పూతగరంలోని ముత్తు కొలక్కి అమ్మన్ ఆలయంలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి) ప్రజలు పూజలు నిర్వహించేందుకు అనుమతించాలని, వారి నివాసాల మీదుగా రథయాత్ర నిర్వహించాలని మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. కులం ఆధారంగా మత విశ్వాసాన్ని, మానవ పక్షపాతంతో దైవత్వాన్ని అడ్డుకోకూడదని వ్యాఖ్యానించింది. ముత్తు కొలక్కి అమ్మన్ ఆలయంలో పూజలు చేయడానికి ఎస్‌సిలను అనుమతించాలని, గ్రామంలోని వారి నివాసాల మీదుగా ఆలయ రథయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరుతూ స్థానిక నివాసి ఎ.సెల్వరాజ్ పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు శనివారం విచారించింది. ఈ పిటిషన్‌కు మద్దతుగా తమిళనాడు అంటరానితనం నిర్మూలన ఫ్రంట్‌కు చెందిన ఎస్. ఆనందన్ మరొక పిటిషన్ దాఖలు చేశారు. గ్రామంలో కొన్ని దశాబ్దాల నుంచి అనుసరిస్తున్న రథయాత్ర మార్గాన్ని మార్చాల్సిన అవసరం లేదని మరికొంతమంది వాదించారు. ఈ వాదనలను మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. ఆచారం, సంప్రదాయం పేరుతో మార్పును నిరోధించలేమని జస్టిస్ పిబి బాలాజీ పేర్కొన్నారు. 'దేవుడు కొన్ని వీధుల్లోనే నివసించడు. ఏ వీధి కూడా రథానికి లేదా అది మోసే దేవునికి అనర్హమైనది కాదు. దేవుడు ఎప్పుడూ వివక్ష చూపడు. కాబట్టి, వివక్షను సంప్రదాయం, పవిత్రత పేరుతో మరుగుపరచలేము' అని వాఖ్యానించారు. దళితులను ఆలయంలోకి పూజ కోసం అనుమతించకపోవడాన్ని న్యాయమూర్తి ఖండించారు. 'భారత రాజ్యాంగం, ఆర్టికల్ 17 ప్రకారం, అంటరానితనాన్ని రద్దు చేసింది. ఈ రద్దు కేవలం భౌతిక రూపంలోనే కాదు, నిజమైన స్ఫూర్తితో జరిగింది. అందువల్ల, దేవుడు ముందు నిలబడటానికి, పూజించడానికి ఎవరు అర్హులు, ఎవరు కాదనే నిబంధనలను ఎవరూ నిర్దేశించలేరు' అని పేర్కొన్నారు. కలెక్టర్ రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించి, అమ్మవారి రథయాత్రను షెడ్యూల్డ్ కులాల నివాస ప్రాంతాల మీదుగా తీసుకుని వెళ్లేలా చూడాలని కోర్టు ఆదేశించింది. రథయాత్ర ప్రశాంతంగా జరిగేలా చూడాలని పోలీసులను ప్రత్యేకంగా నిర్దేశించింది.

ఉద్యోగులకు, ప్రయాణికులకు భద్రత కల్పించండి

- రైల్వే ప్రమాదాలపై సిఐటియు

న్యూఢిల్లీ : ఈ నెల 4న బిలాస్‌పూర్‌కు సమీపంలో జరిగిన ప్రమాదంపై, ఇటీవల దేశంలో రైలు ప్రమాదాలు పెరగడంపై సిఐటియు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. బిలాస్‌పూర్ ప్రమాదంలో లోకోపైలట్ శ్రీవిద్యాసాగర్‌తోపాటు తొమ్మిది మంది మరణించడంపై సంతాపం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది. రైల్వేల్లో భద్రత మెరుగుపడిందని ఆ శాఖ మంత్రి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారని, మరోవైపు రైలు ప్రమాదాలు పునరావృతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. బిలాస్‌పూర్ ప్రమాదంపై సేఫ్టీ కమిషనర్ చట్టబద్ధమైన విచారణ ప్రారంభించకముందే లోకోపైలట్ రెడ్ సిగ్నల్ దాటారని రైల్వే శాఖ ఆరోపించడాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించింది. సిబ్బందిని నిందించడం ఆపాలని కోరింది. ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలకు అనుగుణంగా రైల్వే శాఖ తన ఉద్యోగులు, ప్రయాణికుల భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిఐటియు విమర్శించింది. రైల్వేల్లో ఉద్యోగుల కొరత, ప్రధానంగా లోకో పైలట్ల కొరత తీవ్రంగా ఉందని గుర్తు చేసింది. ఈ ఏడాది జనవరి 1 నాటికి బిలాస్‌పూర్ డివిజన్‌లోనే 2556 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపింది. గత 10 నెలల్లో 500 మంది లోకోపైలట్లు పదవీ విరమణ చేసారని, ఇది ప్రస్తుత సిబ్బందిపై తట్టుకోలేని పనిభారం, ఒత్తిడి సృష్టించిందని తెలిపింది. ప్రస్తుతం వీరికి వీక్లీ సెలవులు నిరాకరించారని తెలిపింది.

ప్రయాణికులు, ఉద్యోగుల మరణాలకు దారితీస్తున్న ప్రమాదాలకు కారణమైన సమస్యలను పరిష్కరించాలని రైల్వే శాఖను సిఐటియు డిమాండ్ చేసింది. పెరుగుతున్న రైళ్ల సంఖ్య, వాటి ఫ్రీక్వెన్సీ, వేగం, లోడ్, పొడవుకు అనుగుణంగా భద్రతా ప్రమాణాలను సంస్కరించాలని విజ్ఞప్తి చేసింది. మెము, ఇము, డెము వంటి వాటిల్లో ఒకే వ్యక్తి పనిచేయడాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది.

ఎల్‌ఎల్‌సిలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మండలం బసాపురం గ్రామానికి చెందిన హరికృష్ణ (12) ఎల్‌ఎల్‌సి కాలువలో గల్లంతై మృతదేహంగా తేలాడు. బంధువుల వివరాల మేరకు... నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన రంగస్వామి, వరలక్ష్మి దంపతుల కుమారుడు హరికృష్ణ.

వరలక్ష్మి పుట్టినిల్లు బసాపురం గ్రామానికి గౌరీ పండగ కోసం వచ్చారు. స్నేహితులతో కలిసి ఎల్‌ఎల్‌సిలో ఈతకు వెళ్లి శుక్రవారం సాయంత్రం గల్లంతయ్యాడు. శనివారం ఉదయం మండలంలోని హనవాలు గ్రామం వద్ద కాలువలో మృతదేహంగా తేలాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రుల్లో వైద్యుల కొరత

- నియమించాలని వైద్యారోగ్యశాఖకు కేంద్ర బృందాలు సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లా ఆస్పత్రుల్లోని ఎస్‌ఎన్‌సియు క్లినిక్‌లలో వైద్యులను నియమించాలని కేంద్ర వైద్య బృందాలు (17వ కామన్‌ రివ్యూ మిషన్‌) వైద్యారోగ్యశాఖకు సూచించాయి. పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో నాలుగు రోజులపాటు పర్యటించి వివిధ ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా స్థాయిలోని ఆస్పత్రుల వరకు కలిపి 19 ఆస్పత్రులను కేంద్ర వైద్య బృందాలు సందర్శించాయి. రోగులను, సమీప ప్రాంతాల్లోని స్థానికులను కలుసుకున్న ఈ బృందాలు గమనించిన అంశాలతో ప్రాథమిక నివేదికను తయారుచేశాయి. ఈ నివేదికలోని ముఖ్యాంశాలను కమిషనర్‌ వీరపాండియన్‌, సెకండరీ హెల్త్‌ డైరెక్టర్‌ కెవిఎన్‌ చక్రధర్‌ బాబుకు వైద్యారోగ్యశాఖ కమిషనర్‌ కార్యాలయంలో శనివారం వివరించాయి. ఈ ఔషధ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించాయి. ఉప ఆరోగ్య కేంద్రాలకు కూడా పవర్‌ అప్‌ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో బయో మెడికల్‌ వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌ వ్యవస్థను పటిష్టం చేయాలని పేర్కొన్నాయి. వైద్యారోగ్యశాఖ సేవలను ప్రజలకు ఎలా అందించాలన్న అంశంపై ఆశా వర్కర్లు, ఇతర సిబ్బందికి తప్పనిసరిగా పునశ్చరణ తరగతులను ఏర్పాటుచేయాలని సూచించాయి. ఎన్‌సిడి ద్వారా ఆరోగ్య సమస్యలున్నట్లు గుర్తించిన వారిని పెద్దాస్పత్రులకు రిఫర్‌ చేయడంపై దృష్టిపెట్టాలని పేర్కొన్నాయి. టిబి పేషెంట్లకు ఎక్స్‌-రే సేవలను మండల స్థాయిలో మరింత విస్తరించాలని, రోగులకు నగదు సాయం పంపిణీలో ఉన్న అవరోధాల్ని తొలగించాలని సూచించాయి. మానసిక సమస్యలు కలిగిన వారికి కౌన్సిలింగ్‌ సేవలు మరింత చేరువ చేయాల్సిందిగా సూచించాయి. పెండింగ్‌లో ఉన్న క్యాటరాక్ట్‌ శస్త్ర చికిత్సలు త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ జాయింట్‌ సెక్రటరీ ఇంద్రాణి పాల్గొన్నారు.

'బ్యాంక్‌'కు లొంగిన కేంద్రం

- ఆర్థిక సంస్కరణల హోరు
- ప్రయివేటు రంగం జోరు
- మహిళలకు నగదు బదిలీ
- అన్నిటికీ తలూపిన మోడీ సర్కార్‌



న్యూఢిల్లీ : ప్రపంచ బ్యాంకు విధించిన అన్ని షరతులకు కేంద్రంలోని మోడీ సర్కార్‌ తలొగ్గింది. భారత్‌లో ఆర్థిక సంస్కరణలను మరింత వేగవంతం చేయాలని ప్రపంచ బ్యాంక్‌ నిర్దేశించింది. వృద్ధి పేరిట ప్రయివేటు రంగానికి ప్రోత్సాహాన్ని ఇవ్వాలని షరతులను విధించింది. వచ్చే 2047 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ 30 లక్షల కోట్ల డాలర్లకు చేరాలంటే ఆర్థిక సేవల రంగంలో మరిన్ని సంస్కరణలు చేపట్టాలని ప్రపంచ బ్యాంక్‌ తన 'ఫైనాన్షియల్‌ సెక్టార్‌ అసెసమెంట్‌ ప్రోగ్రాం (ఎఫ్‌ఎస్‌ఎపి)' నివేదికలో ఆదేశాలు జారీ చేసింది. వీటితో పాటు బ్యాంకు నిర్దేశించిన మార్గదర్శకాలన్నిటినీ కేంద్రం స్వాగతించింది. ఎఫ్‌ఎస్‌ఎపి నివేదికను అధికారికంగా స్వాగతిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రపంచ బ్యాంక్‌ అంచనా భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి మార్గదర్శకంగా ఉంటుందని పేర్కొంది.

ఎఫ్‌ఎస్‌ఎపి అనేది అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్‌), ప్రపంచ బ్యాంక్‌ల ఉమ్మడి కార్యక్రమం. ఈ రెండు అంతర్జాతీయ సంస్థలు ఎఫ్‌ఎస్‌ఎపి పేరుతో ప్రపంచ దేశాల్లో ప్రయివేటీకరణను వేగవంతం చేయడానికి ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తాయి. భారత్‌లో ప్రయివేటు మూలధన సేకరణను పెంచేందుకు ఆర్థిక రంగ సంస్కరణలకు మరింత ఊతమివ్వాలని ప్రపంచ బ్యాంక్‌ తన రిపోర్ట్‌లో పేర్కొంది. బ్యాంక్‌ ఖాతాల వినియోగాన్ని, ముఖ్యంగా మహిళల్లో మరింత పెంచాల్సిన అవసరం ఉందని తెలిపింది. అంటే విద్యా, వైద్యం, అహారం తదితర రంగాల్లోనూ నగదు బదిలీ పెంచడం ద్వారా ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేయాలని ప్రధాన ఉద్దేశ్యంగా స్పష్టమవుతోంది. ప్రభుత్వ, ప్రయివేటు రంగ భాగస్వామ్యాలు (పిపిపి) పెరగాలని సూచించింది.

బ్యాంక్‌లు, బ్యాంకింగేతర విత్త సంస్థలు (ఎన్‌బిఎఫ్‌సి)లు నియంత్రణ, పర్యవేక్షణ నిబంధలను కఠినతరం చేయాలని ప్రపంచ బ్యాంక్‌ తెలిపింది. వీటిపై మరింత మెరుగైన పర్యవేక్షణ కోసం క్రెడిట్‌ రిస్క్‌ మేనేజ్‌మెంట్‌ నియమావళిని మరింత బలోపేతం చేయాలని పేర్కొంది. గడిచిన ఐదేళ్లలో భారత ఈక్విటీ, ప్రభుత్వ, కార్పొరేట్‌ బాండ్లు తదితర క్యాపిటల్‌ మార్కెట్‌ జిడిపిలో 144 శాతం నుంచి 175 శాతానికి పెరిగాయని.. ఇందుకు క్యాపిటల్‌ మార్కెట్లోని మౌలిక వసతులు, భారీగా పెరిగిన మదుపరులు వంటి అంశాలు ఇందుకు దోహదపడ్డాయని పేర్కొంది. మూలధన సమీకరణకు మరింత దోహదపడేలా రుణ విస్తరణ వ్యవస్థ అభివృద్ధి, రిస్క్‌ షేరింగ్‌ ఫెసిలిటీస్‌, సెక్యూరిటైజేషన్‌ వేదికను అభివృద్ధి చేయాలని వరల్డ్‌ బ్యాంక్‌ నివేదిక సూచించింది.

అమరావతిలో ఎలివేటెడ్‌ కారిడార్‌

(మొదటిపేజీ తరువాయి)

అనుసంధానం చేయనున్నారు.

కారిడార్‌లో కీలక అంశాలు

మొత్తం 3.50 కిలోమీటర్ల దూరం కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇందులో అమరావతి నుండి విజయవాడ వైపు మొదటి ర్యాంపు 232 మీటర్ల దూరం ఉండనుంది. గుంటూరు వైపు నుండి అమరావతికి వచ్చే రెండో ర్యాంపు 280 మీటర్ల దూరం నిర్మించనున్నారు. విజయవాడ నుండి అమరావతివైపు మూడోర్యాంపు 115 మీటర్ల దూరం నిర్మిస్తారు. 2.46 కిలోమీటర్ల దూరం ఎలివేటెడ్‌ కారిడార్‌ నిర్మాణం చేస్తారు. దీనిలో రైల్‌ ఓవర్‌ బ్రిడ్జ 99.6 మీటర్లు ఉండనుంది. మొత్తం ప్రాజెక్టులో ఒక మేజర్‌, ఒక మైనర్‌ వంతెనలు ఉండనున్నాయి. రెండోవైపు వాహనాలకు వీలుగా అండర్‌పాసేజ్‌ కల్పిస్తారు. ఒకచోట ట్రంపెట్‌ ఇంటర్‌ ఛేంజ్‌ నిర్మించనున్నారు.

ఏళ్లతరబడి జాప్యమెందుకు?

- అత్యాచార బాధితులకు పరిహారంలో ఆలస్యంపై 'సుప్రీం' ఆందోళన

న్యూఢిల్లీ : అత్యాచార గురైన బాధితులకు పరిహారం విడుదలలో ఏళ్ల తరబడి జాప్యంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. పరిహారం విడుదలయ్యే సమయానికి అత్యాచార బాధితులు మరణించడం, ఈ అంశాన్ని తీర్పుల్లో న్యాయమూర్తులు మర్చిపోవడంపై విస్మయం వ్యక్తం చేసింది. బాధితులకు పరిహారం చెల్లించాలని ప్రత్యేక కోర్టులు / సెషన్స్‌ కోర్టులు ఆదేశాలు ఇవ్వకపోవడం నష్టపరిహారం చెల్లింపుల్లో జాప్యానికి ప్రధాన అడ్డంకిగా ఉంటోందని, బాధితులు రాష్ట్ర న్యాయ సేవల అథారిటీకి దరఖాస్తు చేసుకోవడం లేదా ఇతర మార్గాల ద్వారా పరిహారం పొందాల్సి వస్తోందని జస్టిస్‌ బి.వి. నాగరత్న, జస్టిస్‌ ఆర్‌. మహదేవన్‌ లతో కూడిన ధర్మాసనం ఇటీవల ఇచ్చిన తీర్పులో 'అత్యాచార కేసుల్లో బాధితుల పరిహారం చెల్లింపు కోసం ప్రత్యేక / సెషన్స్‌ కోర్టులు సరైన ఆదేశాలు జారీ చేయాలని నిర్దేశించింది. దీని ద్వారా ఈ ఆదేశాల అమలును రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ జిల్లా న్యాయ సేవల అథారిటీ లేదా తాలూకా న్యాయ సేవల అథారిటీ ద్వారా సులభంగా చేయవచ్చు' అని ఆదేశించింది. ఈ తీర్పును అన్ని హైకోర్టులకు, ప్రత్యేక, సెషన్స్‌ న్యాయమూర్తులకు పంపించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వు కాపీని రాష్ట్ర న్యాయ సేవల డైరెక్టర్లకు పంపాలని స్పష్టం చేసింది. న్యాయవాదులు గౌరవ్‌ కుమార్‌ బన్సల్‌, రాణి మిత్రా, జ్యోతి ప్రవీణ్‌ ఖండపసోల్‌ దాఖలు చేసిన పిటిషన్‌ విచారణలో ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2020 సెప్టెంబర్‌లో మహారాష్ట్రలోని అమరావతి జిల్లా ఖడక గ్రామంలో 25 ఏళ్ల మహిళ దారుణంగా అత్యాచారానికి గురైన విషాదకరమైన కేసును ఈ పిటిషన్‌ వివరించింది. నేరస్తుడిని దోషిగా నిర్ధారించి, ట్రయల్‌ కోర్టు బాధితురాలికి పరిహారం చెల్లించాలని స్పష్టంగా ఆదేశించినా, బాధితురాలికి పరిహారం చెల్లించలేదు. పరిహారం కోసం బాధితురాలి తల్లి, ప్రత్యేక సంరక్షకులు ఏళ్ల తరబడి పోరాటం చేసి, 2024 మేలో మరణించారు. ఆమె మరణించిన ఒక ఏడాది తరువాత అంటే 2025 ఆగస్టులో బాధితురాలు కూడా మరణించింది. బాధితురాలు మరణించే సమయానికి జిల్లా న్యాయ సేవల అథారిటీ ఆమెకు రావాల్సిన పరిహారాన్ని పాక్షికంగానే విడుదల చేసిందని పిటిషన్‌ తెలిపింది.



వారణాసిలోని బనారస్‌ రైల్వే స్టేషన్‌ నుంచి వందే భారత్‌ రైళ్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

భవిష్యత్‌ రైల్వేలకు 'వందే భారత్‌' పునాది

ప్రధాని నరేంద్ర మోడీ

వారణాసి : భవిష్యత్‌లో భారత రైల్వేలకు వందే భారత్‌ రైళ్లు పునాది వేస్తాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. వారణాసిలోని బనారస్‌ రైల్వే స్టేషన్‌ నుంచి నాలుగు కొత్త వందే భారత్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను ఆయన శనివారం ప్రారంభించారు. బనారస్‌-ఖజురహో వందే భారత్‌ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించడంతో పాటు ఎర్నాకులం-బెంగళూరు, లక్నో - సహరన్‌పూర్‌, ఫిరోజ్‌పూర్‌ - ఢిల్లీ మార్గాల్లో నడిచే మిగతా మూడు రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా బనారస్‌లో ఆయన మాట్లాడుతూ కొత్త రైళ్లు ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని పెంచడంతోపాటు ప్రయాణ సమయాన్ని తగ్గిస్తాయని అన్నారు. పౌరులకు సౌకర్యంగా ఉండటంతోపాటు పర్యాటకాన్ని ప్రోత్సాహిస్తాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. దేశ అభివృద్ధిలో మౌలిక సదుపాయాల పాత్ర కీలకమని అన్నారు. వందే భారత్‌, నమో భారత్‌, అమృత్‌ భారత్‌ వంటి రైళ్లు తదుపరి తరం భారతీయ రైల్వేలకు పునాది వేస్తున్నాయని తెలిపారు. గత 11 ఏళ్లలో ఉత్తర ప్రదేశ్‌లో తీర్థయాత్రికుల సంఖ్య బాగా పెరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తర ప్రదేశ్‌ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

వాళ్లని కఠినంగా శిక్షించాలి..



ఇటీవల కోయంబత్తూర్‌ విమానాశ్రయం సమీపంలో ఓ కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. తాజాగా విశాల్‌ ఈ వ్యవహారంపై స్పందించారు. 'ఆ సమయంలో ఆ ప్రదేశంలో బాధితురాలు ఎందుకు ఉందని నిందించడం ఆపండి. దేశంలో పెరిగిపోతున్న ఈ అత్యాచారాలు రాజకీయం చేయడం మానుకోండి. న్యాయవ్యవస్థ ముందు మోకరిల్లి అడుగుతున్నా మీ కాళ్లు పట్టుకుంటా. దయచేసి ఇంత దారుణమైన అపరాధాలకు ఒడిగట్టిన నిందితులకు మరణశిక్ష వేయండి. గతంలో నిర్భయ ఉదంతాలను చూశాం. ఏడేళ్ల బాలికను అత్యాచారం చేయడంతో పాటు కన్న తల్లిని నిర్దాక్షిణ్యంగా హత్య చేసిన వ్యక్తి సుదీర్ఘ విచారణ తర్వాత గత నెలలో నిర్దోషిగా బయటకు వచ్చాడు. ఇలాంటివి పోక్సో వంటి చట్టాల్ని దేశంలో సాధ్యమవుతాయా? ఎప్పటికీ దోషులు తేలమన్న ధైర్యం వల్లే నేరస్తులు మరింత రెచ్చిపోతున్నారు' అంటూ ఆయన తన ఆవేదన వ్యక్తం చేశారు.

అమెరికా కామన్‌ కౌన్సిల్‌ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు హన్నా విజయం

వాషింగ్టన్‌ : న్యూయార్క్‌లోని ఇథాకాలో ఇటీవల జరిగిన కామన్‌ కౌన్సిల్‌ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలు, విద్యార్థి సంఘ నాయకురాలు హన్నా షెఫ్లర్‌ ఐదవ వార్డులో విజయం సాధించారు. హన్నా తన ప్రత్యర్థి జూలియాపై 64.12% ఓట్లను సాధించారు. భూస్వామి, మాజీ సిఇఓ అయిన జూలియా అంతరిక్షం గురించి, మార్కెట్‌ పట్ల గౌరవం గురించి ప్రచారం నిర్వహించారు. విద్యార్థి నేత హన్నా ప్రజా సంక్షేమం గురించి, అద్దెల భారాలు, కార్మికుల హక్కుల గురించి ప్రచారం చేశారు. కార్నెల్‌ విశ్వవిద్యాలయంలో చదువుతున్న హన్నా విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేశారు. 2023 నుంచి పాలస్తీనాకు మద్దతుగా విద్యార్థి సంఘ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలుగానే పని చేస్తున్న హన్నా షెఫ్లర్‌ ఇథాకాలో " జస్ట్‌ రెంట్‌ " సంస్థను స్థాపించారు. దీని ద్వారా ఏకపక్షంగా అద్దెదారులను తొలగించడానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారు. డెమోక్రాట్లకు బలమైన కోట అయిన ఇథాకాలో విద్యార్థులు, కార్మికులు, అద్దెలు చెల్లించేవారి మద్దతుతో హన్నా విజయం సాధించారు. ఈ సందర్భంగా హన్నా మాట్లాడుతూ ప్రగతిశీల భావాలకు ప్రజలంతా మద్దతు పలకాలని అన్నారు.


ఐఎఫ్‌ఎఫ్‌ఐలో రజనీకాంత్‌కి అరుదైన గౌరవం




56వ అంతర్జాతీయ చలనచిత్ర ఉత్సవం(ఐఎఫ్‌ఎఫ్‌ఐ) ముగింపు వేడుకలో రజనీకాంత్‌ను సత్కరించనున్నారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు సుదీర్ఘకాలం పాటు ఆయన చేసిన విశిష్ట సేవలకు గాను ఈ అరుదైన గౌరవం దక్కనుంది. ఇటీవల రజనీకాంత్‌ తన నట జీవితంలో 50 ఏళ్ల ఘన ప్రస్థానం పూర్తి చేసుకున్నారు. గోవా వేదికగా నవంబర్‌ 20 నుంచి 28 వరకు ఐఎఫ్‌ఎఫ్‌ఐ వేడుక జరగనుంది. బస్‌ కండక్టర్‌గా జీవితం ప్రారంభించిన శివాజీ రావు గైక్వాడ్‌ అలియాస్‌ రజనీకాంత్‌, 1975లో కె. బాలచందర్‌ రూపొందించిన 'అపూర్వ రాగంగళ్‌' చిత్రంతో నట జీవితాన్ని ప్రారంభించారు. ఈ వేడుకల్లో గురు దత్‌, రాజ్‌ ఖోస్లా, రిత్విక్‌ ఘటక్‌, పి. భానుమతి, భూపేన్‌ హజారికా వంటి పలు దిగ్గజ కళాకారుల శత జయంతి వేడుకలు కూడా జరగనున్నాయి. ఈ తొమ్మిది రోజుల ఉత్సవంలో 81 దేశాల నుండి 240కి పైగా చలనచిత్రాలను ప్రదర్శించనున్నారు.

సత్య సినిమాలో మిస్‌ యూనివర్స్‌ ఇండియా

'మత్తు వదలరా', 'హ్యాపీ బర్త్‌ డే' సినిమాలు రూపొందించిన రితేష్‌ రాణా మరో కొత్త ప్రాజెక్టుని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో సత్య హీరోగా మిస్‌ యూనివర్స్‌ ఇండియా రియా సింఘా హీరోయిన్‌గా టాలీవుడ్‌ ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమాను క్లాప్‌ ఎంటర్‌ టైన్‌ మెంట్‌ బ్యానర్‌పై నాల్గో చిత్రంగా చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. నవీన్‌ యెర్నేని, రవిశంకర్‌ యలమంచిలి ఈ సినిమాకు ప్రెజెంటర్స్‌గా వ్యవహరిస్తున్నారు. కోర్‌ టెక్నికల్‌ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. ఈ మూవీకి సంగీతం కాల భైరవ, సినిమాటోగ్రాఫర్‌ సురేష్‌ సారంగం, ఎడిటింగ్‌ కార్తిక శ్రీనివాస్‌, ప్రొడక్షన్‌ డిజైన్‌ నార్ని శ్రీనివాస్‌ నిర్వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్‌ షూటింగ్‌ త్వరలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది.





నిర్మాణానంతర పనుల్లో 'కాలగమనం'

గ్రామీణ నేపథ్యంలో ప్రజల జీవన విధానాన్ని అద్భుతంగా తెరకెక్కించిన సినిమా 'కాలగమనం'. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతీ యువకుల మధ్య చోటుచేసుకునే అనుబంధాలు, ప్రేమలు, పెళ్లిళ్లు వంటి అంశాలను మేళవించి సరికొత్త ప్రేమకథతో ఈ సినిమా తెరకెక్కింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలో ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామని [illegible] తెలిపారు. [illegible] రాజా బిరుదుల, లావణ్య రామారావు, చిన్నబాబు కళ్ల, తిరు నేచురల్‌, ఇంకా మూవీ ప్రముఖ ఆర్టిస్టులు జబర్దస్త్‌ ఆర్టిస్టులు తదితరులు నటించారు.

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో

ఎస్‌ఎఫ్‌ఐ విజయభేరి



- స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికల్లో 15 స్థానాలూ కైవసం

పాండిచ్చేరి : ప్రతిష్టాత్మకంగా జరిగిన పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఘన విజయం సాధించింది. కౌన్సిల్లో 15 మంది సభ్యులుకుగాను 15 స్థానాలను కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేసింది. యూనివర్సిటీ స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా వై శ్రేష్ట, వైస్ ప్రెసిడెంట్‌గా పరశురాము, షియోనా జనరల్ సెక్రటరీగా ఇనాయత్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీగా అరివాజియన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా షాహేలా, ఫాతిమా, నేల, జ్యోతిర్మయి, వర్ష, విష్ణు, ప్రణవ్, కీర్తి వాసన్, డానిష్ ఎన్నికయ్యారు. ఇంతకుముందు ఈ నెల 5న జరిగిన యూనివర్సిటీ స్టూడెంట్స్ రిప్రజెంటేటివ్స్ ఎన్నికల్లో మొత్తం 118 స్థానాలకు గాను ఎస్‌ఎఫ్‌ఐ 67 స్థానాలను కైవసం చేసుకుని ఘనవిజయం సాధించింది. స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికల్లో రిప్రెజెంటేటివ్‌లుగా ఎన్నికైన 118 మంది శనివారం అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులతోపాటు 15 మందితో కూడిన కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు.


యూనివర్సిటీ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీకి జరిగిన ఎన్నికల్లో మూడు స్థానాలుగాను మూడు స్థానాలను ఎస్‌ఎఫ్‌ఐ కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. ఎస్‌ఎఫ్‌ఐ అభ్యర్థులకు ఎఐఎస్‌ఎఫ్ మద్దతు ప్రకటించింది.

రాజీలేని పోరాటంతోనే విజయం : నీరజ, శౌర్య

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఘన విజయానికి కారకులైన విద్యార్థి లోకానికి ఎస్‌ఎఫ్‌ఐ పాండిచ్చేరి యూనివర్సిటీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నీరజ, శౌర్య అభినందనలు తెలిపారు. యూనివర్సిటీలో లైంగిక వేధింపులపై రాజీలేని పోరాటం చేయడం వల్లే ఈ విజయం సాధించామన్నారు. యూనివర్సిటీ డే స్కాలర్స్‌కు ఉచిత బస్సు సౌకర్యం, యూనివర్సిటీలో కనీస మౌలిక సౌకర్యాలు, బోధనా సిబ్బంది నియామకాలు, మెస్‌లో ఆహార పదార్థాల నాణ్యత పెంచడం తదితర అంశాలపై చేసిన ప్రచారానికి విద్యార్థులు మద్దతివ్వడం వల్లే పానెల్ మొత్తంగా ఎస్‌ఎఫ్‌ఐ అభ్యర్థులు గెలుపొందారని తెలిపారు. యూనివర్సిటీ యాజమాన్యం స్థానిక పోలీస్ యంత్రాంగం ఎబివిపికి అనుకూలంగా వ్యవహరించినా విద్యార్థులు ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని తిప్పి కొట్టి, చే గువేరా స్ఫూర్తితో ప్రోగ్రెసివ్ అభ్యర్థులను గెలిపించారని చెప్పారు. ఈ సందర్భంగా శనివారం యూనివర్సిటీలో విజయోత్సవ ర్యాలీ జరిగింది.

వందేభారత్‌లో హిందూత్వ ప్రచారం సరికాదు

- పినరయి విజయన్



తిరువనంతపురం : కొత్తగా ప్రారంభమైన ఎర్నాకుళం-బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో దక్షిణ రైల్వే పాఠశాల విద్యార్థులతో ఆర్‌ఎస్‌ఎస్ గీతాన్ని పాడించడం హిందూత్వ రాజకీయాలను ప్రోత్సహించే చర్య అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. "దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన రైల్వేలను సంఘ్ పరివార్ మత రాజకీయ ప్రచారం కోసం ఉపయోగించడం ఆమోదయోగ్యం కాదు" అని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం శనివారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్‌ఎస్‌ఎస్‌తో సంబంధం ఉన్న గణగీతాన్ని అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో చేర్చడం రాజ్యాంగ సూత్రాల ఉల్లంఘన అని ఆయన తెలిపారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం దేశభక్తి కార్యక్రమం ముసుగులో హిందూత్వ రాజకీయాల "చొరబాటు"కు సాక్ష్యంగా నిలిచిందని ఆయన విమర్శించారు. రైలు ప్రారంభ ప్రయాణంలో విద్యార్థులు ఆర్‌ఎస్‌ఎస్ పాటను పాడుతున్న దృశ్యాలను దక్షిణ రైల్వే "దేశభక్తి గీతం" శీర్షికతో ఆన్‌లైన్‌లో షేర్ చేసింది. ఈ చర్య "చాలా అభ్యంతరకరమైనది" అని విజయన్ పేర్కొన్నారు. ఈ చర్య దక్షిణ రైల్వే భారత జాతీయ ఉద్యమ వారసత్వాన్ని అవమానించిందని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో భారతదేశ లౌకిక జాతీయవాదానికి చిహ్నంగా నిలిచిన రైల్వేలు, ఇప్పుడు జాతీయ ఉద్యమాన్ని వ్యతిరేకించిన సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ మతపరమైన ఎజెండాకు లొంగిపోతున్నట్లు కనిపిస్తోందని ఆయన అన్నారు. ఇటువంటి చర్యలు, లౌకికవాదాన్ని అణగదొక్కడానికి, దేశ రాజ్యాంగ నిర్మాణాన్ని బలహీనపరచడానికి ఉద్దేశించిన సంకుచిత రాజకీయ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజా సంస్థలను మతపరంగా మార్చడానికి చేసిన ఈ ప్రయత్నాన్ని గుర్తించాలని, దానికి వ్యతిరేకంగా బలమైన ప్రజాస్వామ్య నిరసనను నమోదు చేయాలని సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను పినరయి విజయన్ కోరారు. విమర్శల నేపథ్యంలో దక్షిణ రైల్వే సోషల్ మీడియా పోస్ట్‌ను ఉపసంహరించుకున్నట్లు తెలిసింది.



జాతీయ సమావేశాల్లో పాల్గొన్న సత్యనారాయణ రాజు తదితరులు

ఘనంగా కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశాలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)


కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ 20వ త్రైవార్షిక జాతీయ సమావేశాలు విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఈ సమావేశాలు జరగనున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ కె.సత్యనారాయణ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోని అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటైన కెనరా బ్యాంక్ తమ ఖాతాదారులకు విశేష సేవలందిస్తోందని, దేశ ప్రగతిలో ముఖ్య భూమిక వహిస్తోందని తెలిపారు. బ్యాంక్ అభివృద్ధిలో ఆఫీసర్స్ అసోసియేషన్ పాత్ర ఎనలేనిదని ప్రశంసించారు. తెలుగువారైన కె.రవికుమార్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంక్ అధికారులు ఐకమత్యంతో అందిస్తోన్న బ్యాంకింగ్ సేవలు దేశ ప్రగతికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. కె.సత్యనారాయణ రాజు జీవితంలో ఎదిగిన క్రమాన్ని వివరిస్తూ పొందుపరిచిన పుస్తకాన్ని ఆయన మాతృమూర్తి రామ సీత ఈ సమావేశంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.రవికుమార్ మాట్లాడుతూ తమ అసోసియేషన్‌కు 50 వేల సభ్యత్వం ఉందని తెలిపారు. ఐకమత్యమే తమ బలమని, ఆ బలమే తమను దేశంలో రెండో అతిపెద్ద ట్రేడ్ యూనియన్‌గా బ్యాంకింగ్ సెక్టార్‌లో నిలిపిందని వివరించారు. బ్యాంక్ అధికారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, దేశ ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. అసోసియేషన్ డిమాండ్లను నెరవేరుస్తూ, బ్యాంక్ అధికారుల సంక్షేమం, ఉన్నతి, అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ఎమ్‌డి సత్యనారాయణ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్దీప్ సింగ్ అహ్లూవాలియా, విజయవాడ సర్కిల్ జనరల్ మేనేజర్ విజయలక్ష్మి, కమిటీ చైర్మన్ రమాప్రసాద్, దేశవ్యాప్తంగా ఉన్న అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల వేతన బిల్లును అడ్డుకున్న డెమొక్రాట్లు

వాషింగ్టన్ : అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ సంక్షోభం తీవ్రమవుతోంది. విధి నిర్వహణలో ఉన్న కొందరు ప్రభుత్వోద్యోగులకు, సైనిక సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు ఉద్దేశించిన బిల్లు శుక్రవారం సెనెట్ ఆమోదం పొందలేకపోయింది. ప్రభుత్వ షట్‌డౌన్ సమయంలో చాలామంది ప్రభుత్వోద్యోగులు వేతనాలు తీసుకోకుండానే పని చేయాల్సి ఉంటుంది. షట్‌డౌన్ ముగిసిన తర్వాతే వారికి ఆ కాలానికి సంబంధించిన వేతనాలు చెల్లిస్తారు. కొందరు ఉద్యోగులకు వేతనాల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు సెనెట్‌లో వీగిపోయింది. ఈ బిల్లును డెమొక్రాట్లు వ్యతిరేకించారు. ఇది ట్రంప్ ప్రభుత్వంపై ఎలాంటి నియమ నిబంధనలు విధించలేకపోయిందని వారు ఆరోపించారు. బిల్లుపై చర్చను కుదించి సత్వరమే తుది ఓటింగ్ జరపాలంటే కనీసం 60 ఓట్లు అవసరమవుతాయి. బిల్లుకు అనుకూలంగా 53 ఓట్లు మాత్రమే పడ్డాయి. 43 మంది బిల్లును వ్యతిరేకించారు. డెమొక్రటిక్ పార్టీకి చెందిన ముగ్గురు సభ్యులు బిల్లుకు అనుకూలంగా ఓటు వేసినప్పటికీ దానికి అవసరమైన ఓట్లు లభించలేదు. రెండు వారాల క్రితం జరిగిన తొలి ఓటింగులో కూడా బిల్లు గట్టెక్కలేకపోయింది. ఉద్యోగులలో ఎవరెవరికి జీతాలు చెల్లించాలో నిర్ణయించే అధికారాన్ని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కే కట్టబెట్టడంతో తాము బిల్లును వ్యతిరేకించామని డెమొక్రాట్లు తెలిపారు.

పర్యావరణ మార్పులతో సేద్యానికి చేటు

- అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో నైజీరియా వ్యవసాయ మంత్రి అడెమోలా ఎ.అడెన్లే
- ఆహార ధాన్యాలు, నూనె గింజలు ఉత్పత్తి పెంచాలి



అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో మాట్లాడుతున్న నైజీరియా వ్యవసాయ మంత్రి అడెమోలా ఎ.అడెన్లే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పర్యావరణ మార్పులతో వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని నైజీరియా వ్యవసాయశాఖ మంత్రి అడెమోలా ఎ.అడెన్లే తెలిపారు. పర్యావరణ మార్పులతోపాటు ప్రపంచీకరణ విధానాల వల్ల ప్రపంచంలోని పలు దేశాలు ముఖ్యంగా ఆఫ్రికా దేశాలు తీవ్ర ఆహార కొరత, ఆహార భద్రత సమస్యలను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. కేరళలోని తిరువనంతపురంలో ఫౌండేషన్ ఫర్ అగ్రేరియన్ స్టడీస్ (ఫాస్) నిర్వహిస్తోన్న అంతర్జాతీయ వ్యవసాయ సదస్సు మూడోరోజు శనివారం కొనసాగింది. ప్లీనరీ సమావేశంలో పలు ఆఫ్రికా దేశాల ప్రతినిధులు, వివిధ వ్యవసాయ విశ్వవిద్యాలయాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు పలు పత్రాలు సమర్పించారు. ఆహార ధాన్యాలతో సహా దిగుమతులపై ఆధారపడటంతో ఆహార కొరత, పిల్లల పౌష్టికాహార లోపం సమస్యలు ఎదుర్కొంటున్నామని పలు ఆఫ్రికా దేశాలు తెలిపాయి. ఇక్రిసాట్ ప్రపంచ ప్రతినిధి మాట్లాడుతూ.. ఆహార ధాన్యాలు, నూనె గింజల ఉత్పత్తి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త, స్వామినాథన్ సహచరుడు జయరాజన్ మాట్లాడుతూ వాతావరణ, పర్యావరణ మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయని, ఫలితంగా ఆకలి, పౌష్టికాహార లోపం సమస్యలను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఆహార సమస్యను ఎదుర్కోవడంతోపాటు అందరికీ ఆహారం అందేలా, అసమానతలు తొలగేలా పరిశోధనలు, నిర్ణయాధినేతల ప్రయత్నాలు ఉండాలని పలువురు శాస్త్రవేత్తలు తమ పత్రాల్లో పేర్కొన్నారు. ఉత్పత్తి పెంచడంతోపాటు ఆయా అంశాలపై దృష్టి పెడితేనే సఫలీకృతమైనట్లని అన్నారు. చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులు, కౌలు రైతులు వ్యవసాయ కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించడంతో వ్యవసాయరంగ అభివృద్ధికి, ఆహార భద్రతకు దోహదపడుతుందన్నారు. నీటి వసతి, సబ్సిడీలు, ఇతర సౌకర్యాల కల్పన కూడా అత్యంత అవసరమన్నారు. ఎరువులు, పురుగుల మందులు ఇతర ధరలు అదుపు చేయడం, పంటలకు సరైన ధరలు కల్పించడంతో రైతును నిలబెట్టాలన్నారు. ప్రభుత్వాల బాధ్యత, జోక్యం తగ్గకూడదని, పెరగాలని సూచించారు. పత్తి, కాఫీ, పౌల్ట్రీ, లైవ్ స్టాకు, ఆయిల్ సీడ్స్, పప్పు ధాన్యాలు కూడా ముఖ్యపాత్ర వహిస్తున్నాయని, వీటిపై కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు.

ప్రొఫెసర్ వెంకటేష్ ఆత్రేయ.. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, నిర్మాణ రంగ కార్మికులు, గ్రామీణ కార్మికులు స్థితిగతుల సమస్యలపై పత్రాలు సమర్పించారు. వ్యవసాయేతర సంబంధిత రంగాల్లో ఉన్నవారి సమస్యలపైనా దృష్టి పెట్టాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రజలందరికీ పౌష్టికాహారాన్ని అందించే బాధ్యతను విధానాల నిర్ణయాధినేతలు, రూపకర్తలు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ప్రొఫెసర్ అరిందం బెనర్జీ మాట్లాడుతూ.. ప్రపంచీకరణ విధానాలు, నూతన ఆర్థిక విధానాలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీశాయని, రైతుల ఆత్మహత్యలు పెరిగేలా చేశాయని అన్నారు. పార్వతీ మీనన్ మాట్లాడుతూ.. తమిళనాడులో 1968లో కిల్వన్ మణిలో జరిగిన నిరుపేద వ్యవసాయ కార్మిక దళితుల ఊచకోత, షణ్ముగం వాచాతి గిరిజన మహిళలపై జరిగిన దారుణ అత్యాచారాలను వివరించారు. ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలు, సందేహాలకు ప్యానలిస్టులు సమాధానం చెప్పారు. తెలంగాణకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త అరిబండి ప్రసాదరావు, టి సాగర్ డిజిటలైజేషన్ ఫర్ ల్యాండ్ మెజర్‌మెంట్సులో అవకతవకలు ఎత్తిచూపే పత్రం ప్రవేశపెట్టారు. దళితులు, వేతనాలు, వర్గ సమస్యలపై చర్చలో ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పాల్గొన్నారు.

గెయిల్ తదుపరి సారథిగా దీపక్ గుప్తా



న్యూఢిల్లీ : ప్రముఖ గ్యాస్ సరఫరా సంస్థ గెయిల్ ఇండియా తదుపరి నూతన ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)గా దీపక్ గుప్తా నియమితులయ్యారు. ఈ మహారత్న కంపెనీలో ప్రస్తుతం ఆయన డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) బాధ్యతలను చూస్తున్నారు. గెయిల్ నూతన సిఎండి కోసం డజన్ మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసిన పబ్లిక్ ఎంటర్‌ప్రైస్ సెలెక్షన్ బోర్డు తుదకు దీపక్ గుప్తాను ఎంపిక చేసింది. గుప్తా ఢిల్లీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ చేశారు.. ఆయిల్ అండ్ గ్యాస్ రంగంలో ఆయనకు 35 ఏళ్ల విశేష అనుభవం ఉంది.



డిజిటల్ పసిడి బాండ్లకు రక్షణ లేదు..!

- అప్రమత్తంగా ఉండాలని సెబీ హెచ్చరిక

న్యూఢిల్లీ : ఆన్‌లైన్‌లో విక్రయిస్తోన్న పసిడి బాండ్లు తమ నియంత్రణ పరిధిలోకి రావని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) స్పష్టం చేసింది. అలాంటి డిజిటల్ గోల్డ్ ఉత్పత్తులు ప్రస్తుత చట్టాల ప్రకారం అవి సెక్యూరిటీలు గానీ, కమోడిటీ డెరివేటివ్‌లు కావని తెలిపింది. కాబట్టి వాటికి సెబీ నియంత్రణ వర్తించదని.. అవి పూర్తిగా సెబీ వెలుపల పని చేస్తాయని పేర్కొంది. అలాంటి ఉత్పత్తులకు సెక్యూరిటీల మార్కెట్ పరిధిలోని పెట్టుబడిదారుల రక్షణ విధానాలు ఏవీ లేవని హెచ్చరించింది. బంగారంలో పెట్టుబడుల కోసం చాలా మంది ఇటీవల కాలంలో డిజిటల్ గోల్డ్‌పై ఆధారపడుతున్నారు. ముఖ్యంగా దంతెరస్, అక్షయతృతీయ లాంటి రోజున ఫిన్‌టెక్ వేదికలు రూ.100 నుంచే డిజిటల్ పసిడిని ఇంటి వద్ద నుంచే కొనుగోలు చేయవచ్చని వినియోగదారులను ఊరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ వినియోగదారులను అప్రమత్తం చేస్తూ ఈ ప్రకటన విడుదల చేసింది. డిజిటల్ లేదా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో లభించే గోల్డ్ ఉత్పత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మదుపర్లను హెచ్చరించింది. దీనివల్ల ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందంటూ తెలిపింది. డిజిటల్ గోల్డ్‌లో కౌంటర్ పార్టీ, ఆపరేషనల్ రిస్కులు పొంచి ఉంటాయని హెచ్చరించింది. అంటే సదరు ప్లాట్‌ఫామ్ తిరిగి డబ్బు చెల్లించలేకపోవడం, నిర్వహణపరమైన ఇబ్బందులకు ఆస్కారం ఉంటుందని తెలిపింది. అయితే మ్యూచువల్ ఫండ్స్ అందించే ఎక్స్ఛేంజ్ ట్రేడ్ ఫండ్స్ (ఇటిఎఫ్), స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడయ్యే ఎలక్ట్రానిక్ గోల్డ్ రిసీట్‌లు (ఇజిఆర్‌ఎస్) వంటివి సెబీ పరిధిలోకి వస్తాయని తెలిపింది.

ఇజ్రాయిల్ దాడుల్లో 69 వేల మంది మృతి



గాజా : ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకూ 69,169 మంది మరణించారని, మరో లక్షా 70 వేల 685 మంది తీవ్రంగా గాయపడ్డారని గాజా ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. శిథిలాల కింద ఉన్న మృతదేహాలను వెలికితీస్తుండటం, గతంలో గుర్తించని వారి మృతదేహాలను తాజాగా గుర్తించడం వల్ల మరణించిన వారి సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. యుద్ధ విరమణ ఒప్పందం తరువాత ఇజ్రాయిల్ తన వద్ద బందీలుగా ఉన్న వారిలో 15 మంది మృతదేహాలను ఖాన్ యూనిస్‌లోని నాజర్ ఆసుపత్రికి శనివారం అప్పగించింది. అదేవిధంగా ఇజ్రాయిల్ వ్యక్తి మృతదేహాన్ని ఆ దేశానికి హమాస్ శుక్రవారం రాత్రి అప్పగించింది. 2023 అక్టోబర్ 7న హమాస్‌తో దాడి సందర్భంగా మరణించిన లియర్ రుడాఫ్‌గా గుర్తించినట్లు నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

వెస్ట్‌బ్యాంక్‌లో రికార్డు స్థాయిలో దాడులు

ఇజ్రాయిల్ సెటిలర్లు వెస్ట్‌బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై ముమ్మరంగా దాడులు చేస్తున్నారు. గత నెలలో రికార్డు స్థాయిలో 264 దాడులు జరిగాయని, 2006 తర్వాత ఈ స్థాయిలో దాడులు జరగడం ఇదే మొదటిసారి అని ఐక్యరాజ్యసమితి తెలిపింది. దాడుల కారణంగా ప్రాణనష్టం, ఆస్తి నష్టం భారీగా జరుగుతోందని, రోజుకు సగటున ఎనిమిది ఘటనలు చోటుచేసుకుంటున్నాయని హెచ్చరించింది. '2006 నుంచి ఇప్పటి వరకూ 9,600 దాడులు జరిగాయి. వీటిలో 1,500 దాడులు ఒక్క సంవత్సరంలోనే జరిగాయి' అని ఐరాస మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయం ఓ ప్రకటనలో వివరించింది. వెస్ట్‌బ్యాంకులో 27 లక్షల మంది పాలస్తీనీయులు నివసిస్తున్నారు. ఇజ్రాయిల్ పక్కనే ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్ పాలస్తీనా రాజ్య ప్రణాళికకు గుండెకాయ వంటిది. ఇదే ప్రాంతంలో నివసిస్తున్న ఐదు లక్షల మందికి పైగా ఇజ్రాయిలీ సెటిలర్లు పాలస్తీనీయులపై నిత్యం దాడులు జరుపుతున్నారు. వెస్ట్‌బ్యాంక్‌లో ఇప్పటి వరకూ ఇజ్రాయిల్ దళాల చేతిలో 42 మంది పాలస్తీనా చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.

ఆహార సాయం నిలిపివేతకు అనుమతి

- అమెరికా సుప్రీంకోర్టు రూలింగ్
- ఆందోళనలో లక్షలాది పేదలు, అల్పాదాయ వర్గాలు

వాషింగ్టన్ : నవంబర్ నెలకు అమెరికాలోని పేదలు, అల్పాదాయ వర్గాల ప్రజలకు అందజేయాల్సిన నాలుగు బిలియన్ డాలర్ల ఆహార సాయాన్ని తాత్కాలికంగా నిలిపివేసేందుకు ట్రంప్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు అనుమతించింది. దీంతో దేశంలోని 4.2 కోట్ల మంది పేదలు, అల్పాదాయ వర్గాల ప్రజలు తీవ్ర ఆందోళనలో పడిపోయారు. మున్నెన్నడూ లేని విధంగా ప్రభుత్వ షట్‌డౌన్ సుదీర్ఘకాలంపాటు కొనసాగుతుండడంతో తమకు అందాల్సిన ప్రయోజనాలపై వారు అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెతాంజీ జాక్సన్ శుక్రవారం అడ్మినిస్ట్రేటివ్ స్టే జారీ చేస్తూ... సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెన్స్ ప్రోగ్రాం (స్నాప్)కు పాక్షికంగా మాత్రమే నిధులు సమకూర్చేందుకు అనుమతించాలన్న ట్రంప్ ప్రభుత్వ అభ్యర్థనను పరిశీలించడానికి దిగువ కోర్టుకు మరింత సమయం ఇచ్చారు.

ఫెడరల్ దారిద్ర్య రేఖ కంటే 130 శాతం కంటే తక్కువ ఆదాయం కలిగిన అమెరికన్లకు స్నాప్ కార్యక్రమం (ఫుడ్ స్టాంపులు) మద్దతు ఇస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఈ కార్యక్రమం కింద గరిష్టంగా నెలకు 298 డాలర్లు (ఒక్కరికి), ఇద్దరు సభ్యులున్న కుటుంబానికి 546 డాలర్లు అందజేస్తున్నారు. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా ఈ సాయం నిలిచిపోయే ప్రమాదం ఏర్పడడంతో రోఢ్ దీవిలోని ఫెడరల్ జడ్జి ఒకరు ఇటీవల ట్రంప్ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేస్తూ నిధుల విడుదలలో కోత విధించకుండా లబ్ధిదారులకు పూర్తి మొత్తాన్ని అందజేయాలని ఆదేశించారు. దీనిపై సుప్రీంకోర్టు జడ్జి తాజాగా స్టే ఉత్తర్వులు జారీ చేశారు. దిగువ కోర్టు ఆదేశాలను కొట్టివేయాలా లేదా అనే విషయంపై బోస్టన్‌లోని ఒకటవ యూఎస్ సర్క్యూట్ అప్పీళ్ల కోర్టు రూలింగ్ ఇచ్చిన తర్వాత రెండు రోజుల పాటు ఈ స్టే ఉత్తర్వులు అమలులో ఉంటాయి.

ఆరు దశాబ్దాల నుంచి అమలులో ఉన్న స్నాప్ పథకం ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా తొలిసారిగా ఈ నెల ప్రారంభం నుంచే నిలిచిపోయింది. దీంతో పేదలు, అల్పాదాయ వర్గాల వారు కుటుంబ బడ్జెట్ నిర్వహణపై కసరత్తులు చేస్తున్నారు. కొందరు అత్యవసర ఖర్చులను కూడా తగ్గించుకుంటున్నారు.

అది ప్రభుత్వ భూమే... ప్రైవేటు ఆస్తి కాదు

- అజిత్ పవార్ తనయుడి కొనుగోలు చేసిన భూమిపై కొనసాగుతున్న దర్యాప్తు


ముంబయి : పూనేలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ కొనుగోలు చేసిన 40 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి చెందినదేనని, అది ప్రైవేటు ఆస్తి కాదని రాష్ట్ర రిజిస్ట్రేషన్ల జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజేంద్ర ముథే స్పష్టం చేశారు. భూమి అమ్మకంలో అవకతవకలపై విచారణ జరుపుతున్న కమిటీకి ఆయన సహాయకారిగా వ్యవహరిస్తున్నారు. పూణేకు చెందిన ఓ వ్యక్తి, పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ శీతల్ తేజ్వానీ ఈ భూమిని పార్థ్ పవార్, దిగ్విజయ్ పాటిల్‌లకు విక్రయించాడు. ఈ లావాదేవీపై దర్యాప్తు జరిపేందుకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ భూమికి ప్రభుత్వమే యజమాని అని డాక్యుమెంట్ చెబుతోందని, 2018 తర్వాత జారీచేసిన ఆస్తి కార్డులో కూడా అదే ఉన్నదని ముథే తెలిపారు. అన్ని అంశాల పైన విచారణ జరుపుతున్నామని, వారం రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆయన చెప్పారు.

పవార్-పాటిల్ భాగస్వామ్య సంస్థ అయిన అమదియా ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి మే 19న రూ.300 కోట్ల రూపాయలకు తేజ్వానీతో సేల్ డీడ్ కుదుర్చుకుంది. ఈ భూమికి యజమానులైన 272 మంది తరపున తేజ్వానీ పవర్ ఆఫ్ అటార్నీ పొందాడు. ఇది ఎస్‌సిలకు (అప్పుడు మహర్‌లు) చెందిన వతన్ భూమి. స్వాతంత్ర్యానికి ముందు రాష్ట్రంలోని కొన్ని గ్రామాలలో వతన్ వ్యవస్థ అమలులో ఉండేది. కొన్ని కులాలు లేదా కుటుంబాలు తాము అందించిన సేవలకు నగదుకు బదులు భూమిని లేదా రెవెన్యూ హక్కులను పొందే వారు. ఈ భూమిలో ఐటి పార్క్‌ను ఏర్పాటుచేసేందుకు అమదియా ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి అనుమతి పొందింది. ప్రస్తుతం ఈ భూమి కేంద్రప్రభుత్వ సంస్థ అయిన బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా (బిఎస్‌ఐ)కి లీజుకు ఇచ్చారు. అక్కడ ఓ బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేయాలని బిఎస్‌ఐ ప్రతిపాదించింది. ఈ లీజు కాలం 2038లో కానీ పూర్తి కాదు. ఆ తర్వాత ఆ భూమి తిరిగి యజమానికి చెందుతుంది.

ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని సేన-బిజెపి ప్రభుత్వం ఈ కంపెనీకి స్టాంప్ డ్యూటీ నుంచి వంద శాతం మినహాయింపు ఇచ్చింది. కూటమితో అజిత్ పవార్ చేతులు కలపడానికి రెండు నెలల ముందు ఈ పరిణామం చోటుచేసుకుంది. మహర్ వతన్ భూ ఒప్పందంపై నమోదు చేసిన క్రిమినల్ కేసు కొనసాగుతుందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ చెప్పారు. భూ ఒప్పందం కుదిరినప్పటికీ నగదు లావాదేవీ పెండింగులో ఉన్నదని తనకు తెలిసిందని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని రెండు పక్షాలు కోరాయని, అయినప్పటికీ వారు చెల్లింపులు జరపాల్సిందేనని అన్నారు. ఈ కేసుతో సంబంధమున్న ఎవరినీ వదలబోమని ఫడ్నవీస్ స్పష్టం చేశారు.

బీహార్‌లో పోల్ స్లిప్స్ రోడ్డుపై పారవేత

- ఎన్నికల అధికారి సస్పెన్షన్



పాట్నా: బీహార్ తొలిదశ ఎన్నికల్లో.... పెద్ద సంఖ్యలో పోల్ స్లిప్స్‌ను రోడ్డుపై పడేశారు. దీంతో ప్రతిపక్ష పార్టీలు పలు అనుమానాలు వ్యక్తం చేశాయి. దీంతో ఒక అధికారిని సస్పెండ్ చేశారు. బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఈ నెల 6న ఆ రాష్ట్రంలో తొలి విడత అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. సరైరంజన్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కెఎస్‌ఆర్ కాలేజీ సమీపంలోని రోడ్డు వద్ద పెద్ద సంఖ్యలో వివిపిఎటి స్లిప్పులు పడేశారు. ఈ వీడియో క్లిప్‌ను ఆర్‌జెడి షేర్ చేసింది. ఈ స్లిప్పులను ఎవరు, ఎప్పుడు, ఎవరి ఆదేశాల మేరకు పడేశారు? అని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య దోపిడీదారులు ఈ చర్యకు పాల్పడ్డారని, ఇసి సమాధానం చెప్పాలని నిలదీసింది. ఈ సంఘటనపై ఇసి స్పందించింది. పోలింగ్‌కు ముందు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఇవిఎం) పరీక్షించేటప్పుడు మాక్ పోలింగ్ కోసం వినియోగించిన స్లిప్స్ అని తెలిపింది. సమస్తిపూర్ జిల్లా మేజిస్ట్రేట్ సంఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ జరిపినట్లు పేర్కొంది. నిర్లక్ష్యం వహించిన సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ (ఎఆర్‌వో)ను సస్పెండ్ చేసినట్లు వివరించింది. ఈ సంఘటనపై కేసు కూడా నమోదైనట్లు ఇసి వెల్లడించింది.



స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రత కల్పించండి : ఆర్‌జెడి

ఇవిఎంలు ఉంచే స్ట్రాంగ్ రూమ్‌లకు భద్రతను పెంచాలని ఆర్‌జెడి ఎంపి మనోజ్ కె ఝా కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు ఆయన లేఖ రాశారు.

నెతన్యాహుపై అరెస్ట్ వారెంట్

- యుద్ధ నేరస్తుడిగా టర్కీ ప్రకటన
- జాబితాలో 37 మంది ఇజ్రాయిల్ అగ్ర నాయకులు

ఇస్తాంబుల్ : ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూపై టర్కీ అరెస్ట్ వారెంట్ జారీచేసింది..గాజా యుద్ధానికి సంబంధించి నేరస్తులుగా పరిగణిస్తూ ఇస్తాంబుల్ ప్రాసిక్యూటర్ కార్యాలయం 37 మంది ఇజ్రాయిలియన్లపై వారెంట్‌లను జారీచేస్తూ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది .. వీరిలో నెతన్యాహుతో పాటు ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కాట్జ్, భద్రతా మంత్రి ఇతమార్ బెన్ గ్విర్, సైన్యాధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఎయిర్ జమీర్‌లు ఉన్నారు. గాజాలో ఇజ్రాయిల్ నరమేధానికి పాల్పడిందని, మానవ హననం చేసిందని తెలిపింది. మానవతా సాయంతో గాజాలో టర్కీ నిర్మించిన హాస్పటల్‌ను ఇజ్రాయిల్ దళాలు నేలమట్టం చేశాయని గుర్తుచేశాయి. ప్రారంభం నుండి టర్కీ ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తుంది. అంతర్జాతీయ న్యాయ స్థానంలో (ఐసిజె)లో దక్షిణాఫ్రికాతో కలిసి కేసు నమోదు చేసింది. టర్కీ ప్రకటనను హమాస్ స్వాగతించింది. టర్కీ ప్రజలు, వారి నాయకులు న్యాయం, మానవత్వం, సోదరభావం, విలువలకు కట్టుబడి పాలస్తీనా తరుపున నిలబడ్డారని పేర్కొంది..అయితే ఈ ప్రకటనపై ఇజ్రాయిల్ మంత్రి గిడియాన్ సార్ స్పందిస్తూ.. టర్కీ అధ్యక్షుడు ఆ దేశంలోని న్యాయవ్యవస్థను రాజకీయంగా కక్ష సాధించడానికి ఉపయోగిస్తున్నారని అందులో భాగంగానే ఈ ప్రకటన విడుదల చేశారని ఆరోపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘించడంపై అనేక దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా... నెతన్యాహు ప్రభుత్వం గాజాపై మారణహోమాన్ని కొనసాగించడం గమనార్హం.





మీ కోసం

శీతాకాలంలో పిల్లల మసాజ్‌కు ఆవనూనె వాడాలి. ఇది ఒంటికి సహజంగా వేడినివ్వడంతోపాటు ర్యాష్ వంటి చర్మ సమస్యలను కూడా దూరం చేస్తుంది. ఆవనూనె సాధ్యం కానప్పుడు వెన్న, మీగడలతో కూడా మసాజ్ చేయవచ్చు.

జీవన సౌరభం

వెలిగే దీపమే ఇతర దీపాలను వెలిగించినట్లు నిరంతరం నేర్చుకునే వారే ఇతరులకు జ్ఞానాన్ని పంచగలరు.

JEEVANA
జీవన the family

కుప్పతొట్టి



విక్రం ఉన్నత విద్య అభ్యసించి ఒక కంపెనీలో చేరాడు. నెల రోజుల తరువాత జీతం తీసుకొని ఇంటికి వచ్చాడు. స్నేహితులందరూ విక్రంను కలుసుకొని యోగక్షేమాలు అడిగారు. 'విక్రం. మీ కంపెనీలో ఏం తయారు చేస్తున్నారు' అని ఒక స్నేహితుడు అడిగాడు. 'చెత్త' అని సమాధానం చెప్పాడు విక్రం.

'ఏమిటి చెత్త తయారు చేస్తున్నారా?' అని అందరూ ఒక్కసారిగా గట్టిగా అడిగారు. 'ఔనురా' అన్నాడు 'విక్రం. 'ఆ చెత్తను ఏం చేస్తారు?' అని మరో స్నేహితుడు అనుమానంగా అడిగాడు. 'కుప్ప తొట్టిలో వేస్తారు' అని చాలా అసహనంగా చెప్పాడు విక్రం.

'అదేంట్రా! ఈ చెత్త వల్ల 'మీ కంపెనీ వాడికి ఏం లాభం' అని స్నేహితులందరూ చాలా కుతూహలంగా అడిగారు. 'జనాలు ఆ చెత్తని డబ్బులకి కొనుక్కుంటారు. అదే మా కంపెనీకి లాభం' అని విక్రం చెప్పిన సమాధానం విని అందరూ తెల్లమొఖాలు వేశారు.

'రేయ్ విక్రం, నిజం చెప్పారా. అసలు మీ కంపెనీ ఏం తయారుచేస్తోంది. జనాలు వాటిని ఎందుకు కొంటున్నారు' అని మిత్రులందరూ బతిమాలుతున్నట్లు ముఖం పెట్టి అడిగారు.

'నేను నిజమే చెబుతున్నాను. మా కంపెనీలో తయారు చేసేది ఆరోగ్యానికి హాని కలిగించే జంక్ ఫుడ్ అనే చెత్త. జంక్ ఫుడ్‌ని పిల్లలు కొనుక్కొని కుప్పతొట్టి లాంటి కడుపులోకి పంపుతున్నారు' అన్నాడు విక్రం. విక్రం చెప్పిన మాటలు అందరిలోనూ ఆలోచింప చేశాయి.

– ఓట్ర ప్రకాష్ రావు,
తిరుత్తణి, 097874 46026.

రెక్కలొచ్చిన పక్షులు..

చక్కనైన పిచ్చుక ఒకటి
చప్పున చెట్టుపై వాలింది

అటు ఇటు తిరిగి చూసింది
పుల్లలు ఏరుకు వచ్చింది

చిన్న గూడును చక్కగ కట్టింది
కొన్ని గడ్డి పరకలు తెచ్చింది

మెత్తని పాన్పు సిద్ధం చేసింది
గూటిని చక్కగ తీర్చిదిద్దింది

ఆ గూటిలో గుడ్లను పెట్టింది
ఆకులు అలములు కప్పింది

ఆ గుడ్లన్నీ పదిల పరిచింది
తదుపరి వాటిని పొదిగింది

నాలుగు పిల్లలు పుట్టాయి
వాటికాహారం అందించింది

ప్రేమతో వాటిని సాకింది
లోక రీతులను నేర్పింది

పిల్లలు మెల్లగ ఎదిగాయి
రంగుల రెక్కలు మొలిచాయి

కిచ కిచమంటూ అరిచాయి
చప్పున రెక్కలు తెరిచాయి

క్షణంలో గూటిని వదిలాయి
రివ్వున గాలిలో ఎగిరాయి

రెక్కలు చక చక ఆడిస్తూ
స్వేచ్ఛగా గిరికీలేసేస్తూ

ఆకసాన విహరించాయి
ఆనందంగా గడిపాయి

సాయం సంధ్యా సమయంలో
చక్కగ గూటికి చేరాయి

ఆహారం ఆరగించాయి
తల్లి రెక్కలమాటున దాగాయి

ఎదిగిన తన పిల్లల చూసి
తల్లెంతగానో
మురిసిపోయింది

రెక్కలొచ్చిన పిల్ల పక్షులిక
గూడును విడిచి వెళ్ళాయి

విడివిడిగా ఎగిరిపోయాయి
స్వేచ్ఛగ జీవిస్తున్నాయి

బోసిపోయిన గూడును
చూసి
తల్లి పక్షెంతో చిన్న బోయింది

అది చివరికి ఒంటరిదయ్యింది
ఆ గూడే తోడై కాలం గడిపింది

– నాగరాజు కామర్సు,
92480 93580.

నేను గీసిన బొమ్మ





ఎస్.కె.నజీర్,
10వ తరగతి,
జెడ్‌పి హైస్కూల్,
మారెళ్ల, ముండ్లమురు,
ప్రకాశం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చట్టాలపై అవగాహనతోనే హక్కులకు రక్షణ

నిత్య జీవితంలో ఉదయం నుంచి రాత్రి వరకూ సమాజంలో అనేక సంఘటనలు చూస్తున్నాం. ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని ఓ యువతి... చిట్టీలు కట్టించుకుని ఉడాయించిన ఘరానా సంస్థలు, వ్యక్తులు..చిట్‌ఫండ్ కంపెనీలు.. ఆన్‌లైన్ మోసాలు..ప్రేమించకపోతే చంపేస్తామని బెదిరింపులు... ఆస్తికోసం హత్యలు... వరకట్న వేధింపులు.. లైంగిక దాడులు... ఇలా అనేక సంఘటనలు చూస్తున్నాం. పత్రికల్లో చదువుతుంటాం.. ఇలాంటి సందర్భాల్లో బాధితులకు అండగా రాజ్యాంగం రూపొందించిన కోర్టులు, చట్టాలు ఉన్నాయి. వాటిపై అవగాహన పెంచుకుని ప్రయత్నిస్తే న్యాయం పొందే వీలుంటుంది. కానీ చాలామంది అవగాహనా రాహిత్యంతో ఆ బాధను లోలోపల మింగేస్తూ బాధపడుతుంటారు. ఇక మనకు న్యాయం జరగబోదనే భయంతో ఇంకొందరు ఆత్మహత్యలు చేసుకుంటారు. కులం, మతం, ప్రాంతంతోపాటుగా చిన్నా, పెద్ద, పేద, ధనిక అనే తారతమ్యాలు లేకుండా చట్టం ద్వారా రక్షణ, న్యాయం పొందే వెసులుబాటును కోర్టులు ఇచ్చాయి. ప్రజలు ముందుగా వాటిపై అవగాహన పెంపొందించుకుని కాస్త ఓపిగ్గా ప్రయత్నిస్తే బాధితులకు చట్టపరంగా న్యాయం జరుగుతుంది. నిందితులను చట్టపరంగా కోర్టులు శిక్షిస్తాయి. బాధితులకు భరోసాను కల్పిస్తాయి.

అవగాహన కోసమే : దేశవ్యాప్తంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య కూడా రోజు రోజుకు పెరిగిపోతోంది. చట్టంపై అవగాహన లేకపోవడంతో చాలా మందికి న్యాయం జరగడం లేదు. ఈ రెండు సమస్యలను పరిష్కరించడానికి జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని జరుపు కుంటారు. మన భారతదేశంలో లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్, న్యాయవ్యవస్థ అనే మూడు వ్యవస్థలు కొనసాగుతున్నాయి. వీటిలో న్యాయవ్యవస్థ ప్రజలకు న్యాయం చేసే పనిలో నిమగ్నమై ఉంది. న్యాయ సేవ అనేది ప్రజలందరికీ సులభంగా,



నేడు జాతీయ న్యాయ సేవల దినోత్సవం



అవసరమైనప్పుడు అందుబాటులో ఉండదు. నవంబర్ 9న దేశవ్యాప్తంగా నిరుపేదలకు ఉచిత న్యాయ సేవలపై అవగాహనా కార్యక్రమాలు జరుగుతాయి.

మొదటగా ఎవరిని ఆశ్రయించాలంటే...

ఏదైనా సంఘటనల్లో హక్కులకు భంగం కల్గితే కోర్టును ఎలా ఆశ్రయించాలో ఇంకా చాలామందికి తెలియదు. బాధితులు మొదటగా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. అక్కడ కేసు నమోదయ్యాక ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఎఫ్ఐఆర్) కాపీ ఇస్తారు. అది తీసుకోవాలి. అక్కడ నుంచి కోర్టుకు కేసు వెళ్తుంది. విచారణల అనంతరం న్యాయమూర్తి తీర్పులు విధిస్తుంటారు. చిన్న కేసులు పోలీస్‌స్టేషన్లలోనే పరిష్కార మవుతుంటాయి. వివాదాలు ఉన్నవి కోర్టుల దాకా వస్తాయి. ఏదైనా బాధితులు ధైర్యంగా ముందుకు అడుగు వేస్తేనే న్యాయం జరుగుతుంది. మౌనంగా ఉంటే అన్యాయమే గెలిచినట్లు అవుతుంది. అందువల్ల ఏ సంఘటన జరిగినా ముందస్తుగా పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ ఇవ్వటం ప్రాథమిక కర్తవ్యంగా భావించాలి.

పేదలకు అండగా ఎల్ఎస్ఎ : తప్పు చేసిన వాడే తిరిగి పోలీసు స్టేషన్‌కు వెళ్లి తప్పుడు కేసు పెడితే, అది నమోదైతే ఎలా ఎదుర్కోవాలో అర్థం కాదు. న్యాయవాదిని పెట్టుకొనేంత ఆర్థిక స్థోమత ఉండదు. నేటికీ మన దేశంలో ఇంకా ఇలాంటి పరిస్థితి సుమారుగా 45 శాతం వరకూ ఉందంటే పరిస్థితిని ఇట్టే అర్థం చేసుకోవచ్చు. సమాజంలో ఇదీ సగటు పేదవాడి దుస్థితి. పేద ప్రజలకు న్యాయం అందించటం కోసం 30 ఏళ్ల క్రితం ఏర్పాటైందే 'లీగల్ సర్వీసెస్ అథార్టీ (ఎల్ఎస్ఎ)'. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇవి పనిచేస్తున్నాయి. పేదలకు న్యాయసాయం అందించడం, కోర్టు కేసులను మధ్య వర్తిత్వంతో పరిష్కరించడం, లోక్ అదాలత్‌లు నిర్వహించడమే కాదు. వృద్ధులకు ఆసరాగా నిలవడం, పేద విద్యార్థులకు సాయం చేయడం సహా అనేక సామాజిక కార్యక్రమాలను లీగల్ సర్వీసెస్ అథార్టీ నిర్వహిస్తోంది. కొన్ని సందర్భాల్లో పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా లేదా సుమోటోగా పలువురి బాధలను తీరుస్తోంది. కోవిడ్ సమయంలో ఆస్పత్రుల్లో పడకలు అందేలా చర్యలు తీసుకోవడం, విడిపోయిన భార్యాభర్తలను కలపడం, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం వసతులు, వేతనం అందేలా చేయడం, మతిస్థిమితం కోల్పోయిన వారికి ఆశ్రయం కల్పించడం లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది.

ఎలా పనిచేస్తాయంటే...: లీగల్ సర్వీసెస్ అథార్టీ చట్టం 1987 ప్రకారం 1995 నవంబర్ 9న జాతీయ లీగల్ సర్వీసెస్ అథార్టీ ఏర్పాటైంది. దీనికి జాతీయ స్థాయిలో ప్యాట్రన్ ఇన్ ఛీఫ్‌గా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర స్థాయిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యవహరిస్తారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో లీగల్ సర్వీసెస్ అథార్టీలు పనిచేస్తున్నాయి. పేదల కేసులను వాదించేందుకు, న్యాయ సలహా అందించేందుకు ప్రత్యేకంగా న్యాయవాదులను నియమించాలన్న జాతీయ లీగల్ సర్వీసెస్ అథార్టీ నిర్ణయం మేరకు రాష్ట్రంలో చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ (జిల్లా స్థాయి), డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ (సబ్ కోర్టు), అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ (మేజిస్ట్రేట్ కోర్టు)లు పనిచేస్తున్నాయి.

పెద్దఎత్తున అవగాహనా కార్యక్రమాలు

అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం, మార్గదర్శకత్వం అందిస్తుంది. అలాగే, మధ్య వర్తిత్వం , సామరస్యపూర్వక చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించడానికి ఇది పనిచేస్తుంది. ఒక వ్యక్తి పేదవాడైనా, విభిన్నప్రతిభావంతుడైనా, సమాజంలోని బలహీన వర్గానికి చెందిన వారైనా, న్యాయం పొందేందుకు ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. ప్రజలకు న్యాయం పొందే హక్కుపై అవగాహన కల్పించారు. విద్యా సంస్థలు, ఇతర ప్రదేశాల్లో ముఖ్యమైన చట్టాల గురించి విద్యార్థులు , మహిళలకు అవగాహన కల్పిస్తుంటారు.

న్యాయసేవలు ఇవే...

- ఉచితంగా న్యాయ సలహాలు అందించడం
- కేసులు పరిశీలించి బాధితుని తరపున న్యాయవాదిని నియమించడం
- కోర్టు ఫీజులను భరించడం
- తీర్పు వచ్చిన తర్వాత కాపీలను ఉచితంగా అందజేయడం

ఇలా ఆశ్రయించాలి : ఉచిత న్యాయ సాయం కోసం మండల న్యాయసేవాధికార సంఘం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాల కోసం ఫోన్ లేదా టోల్‌ఫ్రీ నంబర్లలోనూ సంప్రదించొచ్చు.

న్యాయ సేవలు ఎవరెవరికి అంటే...

- ఎస్‌సి, ఎస్‌టిలు
- మానవ అక్రమ రవాణా బాధితులు, యాచకులు
- మహిళలు, బాలబాలికలు
- విభిన్న ప్రతిభావంతులు
- ప్రకృతి విపత్తులు, కుల, మత కల్లోలాల బాధితులు
- పారిశ్రామిక కార్మికులు
- రక్షణ గృహం, అనాథ గృహం, బాలల గృహం, మానసిక చికిత్సాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి..
- సంవత్సర ఆదాయం రూ.3 లక్షలు మించని వారికి...



– నండూరి పద్మాంజలి
సీనియర్ న్యాయవాది,
నూజివీడు పట్టణం,
ఏలూరు జిల్లా.

టి20 సిరీస్ విజేత టీమిండియా

- ఆస్ట్రేలియాతో ఐదో మ్యాచ్ వర్షంతో రద్దు
- ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అభిషేక్

బ్రిస్బేన్ : ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు టి20ల సిరీస్‌ను టీమిండియా 2-1తో చేజిక్కించుకుంది. గబ్బాలో జరగాల్సిన ఐదో, చివరి టి20 వర్షం కారణంగా రద్దయ్యింది. శనివారం గబ్బాలో భారత ఇన్నింగ్స్ 4.5ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 52పరుగులు చేసింది. అనంతరం వర్షం.. అంతరాయం కలిగించి ఎంతకూ తగ్గకపోవడంతో అంపైర్లు చివరకు ఆటను రద్దు చేశారు. దాంతో.. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు విజయాలు సాధించిన సూర్యకుమార్ యాదవ్ బృందం విజేతగా నిలిచింది. దీంతో ఈ ఫార్మాట్‌లో తమకు తిరుగులేదని భారత జట్టు మరోసారి చాటుకుంది. ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ (2-1) చేజారినా.. టి20ల్లో కంగారూ టీమ్‌కు షాకిచ్చింది. తొలి మ్యాచ్ వర్షార్పణం కాగా.. రెండో టి20లో ఆతిథ్య జట్టు గెలిచి సిరీస్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే.. కాంబినేషన్‌లో మార్పులు చేసుకున్న టీమిండియా.. వరుసగా రెండు మ్యాచుల్లో కంగారూలకు చెక్ పెట్టింది. పేసర్ అర్ష్‌దీప్ సింగ్, ఓపెనర్ అభిషేక్ శర్మలు మెరవడంతో మూడో మ్యాచ్‌లో.. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ గొప్పగా రాణించడంతో నాలుగో టి20లో మార్ష్ సేనను మట్టికరిపించింది.

4.5వ ఓవర్లో

నాలుగో టి20లో భారీ విజయంతో సిరీస్‌లో ముందంజ వేసిన భారత్.. ఐదో మ్యాచ్‌లోనూ ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ(23 నాటౌట్), శుభ్‌మన్ గిల్(29 నాటౌట్)లు బౌండరీలతో విరుచుకుపడి శుభారంభమిచ్చారు. అయితే.. 4.5వ ఓవర్లో భారీగా ఉరుములు, మెరుపులు కారణంగా అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేశారు. సిరీస్ అద్భుతంగా ఆడిన అభిషేక్ శర్మ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. గత మూడేళ్లలో ఆసీస్ సొంత గడ్డపై టి20 సిరీస్ కోల్పోవడం ఇది నాలుగోసారి. మూడు పర్యాయాలు టీమిండియా చేతిలోనూ ఆ జట్టుకు పరాభవం ఎదురవ్వడం గమనార్హం.



టి20 సిరీస్‌లలో సూర్యకు అద్భుత రికార్డు..

నిరుడు టి20 వరల్డ్ కప్ తర్వాత కెప్టెన్సీ అందుకున్న మిస్టర్ 360 డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్ అద్భుత రికార్డుతో దూసుకెళ్తున్నాడు. ఆటగాడిగా విఫలమవుతున్నా సారథిగా జట్టుకు వరుసగా సిరీస్ విజయాలు అందిస్తున్నాడు. అతడి సారథ్యంలో ఇప్పటివరకకూ టీమిండియా ఒక్క సిరీస్ ఓడిపోలేదు. తొలుత స్వదేశంలో ఆస్ట్రేలియాపై 4-1తో సిరీస్ కొట్టిన భారత్.. ఆపై దక్షిణాఫ్రికా గడ్డపై 1-1తో సమం చేసింది. అనంతరం శ్రీలంక, బంగ్లాదేశ్‌ను 3-0తో వైట్‌వాష్ చేసింది. ఆ తర్వాత సఫారీలపై 3-1తో, ఇంగ్లండ్‌పై 4-1తో సిరీస్ గెలుపొందింది సూర్యకుమార్ బృందం. ఇదే ఊపులో ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత్ ఇప్పుడు ఆస్ట్రేలియాను 2-1తో మట్టికరిపించింది. ట్రోఫీ అందుకునే క్రమంలో సూర్య మాట్లాడుతూ. 'ఎట్టకేలకు ఒక ట్రోఫీని చేతుల్లోకి తీసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. సిరీస్ విజేతగా నిలిచినందుకు నాకు ట్రోఫీని అందించారు. వారం క్రితమే వన్డే వరల్డ్ కప్ ఛాంపియన్‌గా అవతరించిన మహిళల జట్టు ట్రోఫీని గెలుచుకుంది. ఆ ట్రోఫీ కూడా భారత్‌కు వచ్చేసింది. అందుకే.. ఈ ఆసీస్‌పై సిరీస్ విజయంతో దక్కిన ఈ ట్రోఫీని ముట్టుకొని.. మురిసిపోయాను' అని మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో సూర్యకుమార్ వెల్లడించాడు.

రికార్డుపుటల్లో అభిషేక్

టీమిండియా యువ పేసర్ అభిషేక్ శర్మ టి20ల్లో ఒక రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. కేవలం 528బంతుల్లోనే 1000 పరుగుల మార్క్‌ను అందుకని రికార్డుపుటల్లోకెక్కాడు. ఈ ఫార్మాట్‌లో తక్కువ బంతుల్లో 1000 పరుగులు కొట్టిన ఏకైక బ్యాటర్ అభిషేక్ మాత్రమే. దీంతో టి20 క్రికెట్ చరిత్రపుటల్లో అభిషేక్ శర్మ పేరు లిఖించబడింది.

టి20ల్లో తక్కువ బంతుల్లో 1000 పరుగుల కొట్టిన బ్యాటర్లు..

528 : అభిషేక్ శర్మ(భారత్)
573 : సూర్యకుమార్ యాదవ్(భారత్)
599 : ఫిల్ సాల్ట్(ఇంగ్లండ్)
604 : మ్యాక్స్‌వెల్(ఆస్ట్రేలియా)
611 : ఫిన్ అలెన్(న్యూజిలాండ్)

న్యాయవాదుల క్రీడా పోటీలు ప్రారంభం

విజయవాడ : రాష్ట్రస్థాయి న్యాయవాదుల క్రీడాపోటీలు శని వారం విజయవాడ కోర్టు సముదాయంలో ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు నిర్వహించనున్న క్యారమ్స్, చెస్ పోటీలను ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రరాయ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 148 బార్ అసోసియేషన్ల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. 200 మందికిపైగా చెస్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొన్నారు. హైకోర్టు న్యాయమూర్తి మానవేంద్రరాయ్ మాట్లాడుతూ.. కొత్త కొత్త ఆవిష్కరణలకు బెజవాడ బార్‌కు ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. ఎంతోమంది న్యాయవాదులు, త్యాగమూర్తులు ఈ బార్ నుంచే వచ్చారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి, రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద, పశ్చిమగోదావరి జిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షులు, ఎపి బార్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ కె.సీతారాం, ఎపి బార్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎ.కె.బాష, ప్రముఖ న్యాయవాది హజరత్తయ్య గుప్తా, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్, హైకోర్టు అధ్యక్షులు చిదంబరం పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రరాయ్

జురెల్ సెంచరీ

- దక్షిణాఫ్రికా-ఎ లక్ష్యం 417పరుగులు

బెంగళూరు: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో, చివరి అనధికారిక టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లోనూ టీమిండియా బ్యాటర్ ధ్రువ్ జురెల్ సెంచరీతో కదం తొక్కాడు. దీంతో దక్షిణాఫ్రికా-ఎ ముందు 417పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్-ఎ జట్టు నిలిపింది. మూడోరోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా-ఎ జట్టు వికెట్లేమీ నష్టపోకుండా 25పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి .. పరుగులతో శనివారం మూడోరోజు ఆటను కొనసాగించిన భారత్ 7వికెట్ల నష్టానికి 382 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్(127నాటౌట్) సెంచరీకి తోడు హర్ష్ దూబే(84) బ్యాటింగ్‌లో రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లో నిరాశపరిచిన టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఫామ్‌లోకి వచ్చాడు. అతడు రెండో ఇన్నింగ్స్‌లో 65పరుగులతో రాణించాడు. దక్షిణాఫ్రికా బ్యాటర్లు జోర్డాన్ హెర్మన్(15) సెనెక్వానే(9) క్రీజ్‌లో ఉన్నారు. రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్-ఎ 1-0 ఆధిక్యతలో ఉన్న సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68